


آن

PAKG20A117

T

పల్లకీ

శ్వర్ణోత్సవ వంపుటాలు :

కృష్ణపక్షిమ

పల్లకీ

శర్మిష్ఠ

ధనుర్దాను

శిరుప్పావు

మేఘమాల

పల్నాటి వీరచరిత్ర పద్యాలు

దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి

దేవులపల్లి కృష్ణశాస్త్రి
పున్ముద్రణసంఘ ప్రచురణ

PALLAKEE

Krishna Sastri's Poems

© Copyright - Devulapalli Venkata Krishna Sastri

Golden Jubilee
(First) Edition:
January 1975

Published by
DEVULAPALLI KRISHNA SASTRI
SANMAANA SANGHAM, MADRAS.

Printed at
SRI KALA PRINTERS,
Madras-33.

Cover Design:
BUJJAI

Price:
Rs 8-00

ప్రాప్తిస్థానం :
కృష్ణశాస్త్రి సన్మానసంఘం
ప్రచారకార్యాలయం,
14, సుంకురామచెట్టి స్ట్రీట్,
మదరాసు-1.



జానకిరాంకి

నీకు ఎంతో ఇష్ట మైనవీ,
నీ 'కారు'లో ముందు అద్దం మీద అంటించుకుని ఎప్పుడూ
చదువుకునేవీ,
నేను 'బదరిక'లో వ్రాపినవీ
పద్యాలు ఈ సంపుటిలో ఉన్నాయి -
తీసుకో!

(5)

కవితా స్వర్ణోత్సవం

శ్రీ కృష్ణశాస్త్రిగారికి 77 విండాయి. అయితే వారి కలానికి ప్రౌఢయౌవనం వచ్చిందిగాని, వృద్ధాప్యం రాలేదు. వయసు పైబడుతున్న కొద్దీ వారి మనసుకు వైశాల్యం, భావనకు పదను పెరుగుతున్నాయి. ఆయన ప్రాసిన ప్రతి వాక్యంమీద, ఆయన ప్రత్యేకముద్ర ఉంటుంది. తెలుగు నుడికి జిలుగూ వెలుగూ సంతరించి, తెలుగుకవితను క్రొత్త పుంతలు త్రొక్కించిన వైతాళికులలో శాస్త్రిగారు ప్రముఖులు. భావకవితోద్యమానికి వారు ప్రవక్తలు. ఆ నవ్య కవితారీతికి ఒరవడి వారి 'కృష్ణపక్షము.'

'కృష్ణపక్షము' 1925 లో వెలువడింది. ఇప్పటికి 50 ఏండ్లక్రితం. ఒకవిధంగా ఆ ప్రచురణ నవ్యకవితకు నాంది. అందువలన, 1975 కృష్ణశాస్త్రి కవితకేగాక, ఆధునిక కవితావిర్భావానికి స్వర్ణోత్సవవత్సరం- ఈ సంవత్సరాన్నే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "తెలుగు సంస్కృతి వికాస వత్సరం"గా ప్రకటించి ఉండడం ఒక విశేషం- ఆ కారణంచేత శ్రీ శాస్త్రిగారివి తగువిధంగా సత్కరించాలని

కొందరు మిత్రులం, ఆరాధకులం, కలిసి, ఒక సన్మాన సంఘంగా ఏర్పడ్డాం.

కవిసత్కారం అనేకవిధాలు. వెనుకటి యుగంలో రాజులు, జమీందార్లు, తమ ఆస్థానాల్లో పండితసమక్షంలో వారిచేత కవితాగానం చేయించి, వారికి, మెచ్చుకోలుతో పాటు, ధనకనక వస్తువాహనాలు సమర్పించి గౌరవించే వారు. 'రాజయుగం' పోయింది. 'ప్రజాయుగం' వచ్చింది. రచయితలను కొంతవరకు కేంద్రప్రాంతీయ ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి, గౌరవిస్తున్నాయి. రసజ్ఞులైన పౌర ప్రముఖులు అక్కడక్కడ కవులకు, కథకులకు, పండితులకు, నాటకకర్తలకు సన్మానాలు ఏర్పాటు చేస్తున్నారు. పూలమాలలు, దుశ్శాలువలు మొదలుకొని, 'పర్సు'లవరకు సమర్పించి రచయితల యెడల తమ గౌరవాదరాలు తెలియ పరచుకుంటున్నారు.

శ్రీ కృష్ణశాస్త్రిగారిని, ఈ స్వర్ణోత్సవసందర్భంలో ఏవిధంగా సత్కరించాలన్న ప్రశ్న చర్చకు వచ్చింది.

తెలుగు సాహిత్యరంగంలో విలువలు తారుమారయి పోతున్న ఈ దినాలలోకూడా, మారని విలువ శ్రీ కృష్ణశాస్త్రిగారు. వారి సినీమాపాటలకుకూడా సాహిత్యగౌరవం ఉంది. అయితే వారి 'కృష్ణపక్షము - ప్రవాసము - ఊర్వశి' గాని, ఆ తరువాత రచించిన వందలాదిపద్యాలు, భావగీతాలు, పాటలు, రేడియోనాటికలు, యక్షగానాలు, ప్రసంగాలు, వ్యాసాలుగాని ఈనాడు తెలుగునాట గ్రంథాలయాలలోనైనా

దొరకవు. అభిమానులనోట ఏ వేదికపైననో, ఏ సుహృద్గోష్ఠిలోనో విని ఆనందించడమేగాని, పుస్తకరూపంలో వారి అపురూప రచనలు రసజ్ఞులకైనా అందుబాటులో లేవు. ఈ కొరత కొంతవరకైనా తీర్చాలని, సుమారు పది ఏండ్లక్రితం, కావలి విశ్వోదయవారు, కృష్ణశాస్త్రిగారి వచన రచనలలో కొన్నింటిని మూడుసంపుటాలుగా ప్రచురించారు. వారి మిగిలిన రచనలలో ఎన్ని సాధ్యమైతే అన్ని పుస్తక రూపంలో, స్వర్ణోత్సవ సమర్పణగా తెలుగుదేశానికి అందించాలని, సన్మానసంఘం నిశ్చయించింది. తత్ఫలితమే ఈ కృషి.

శ్రీ కృష్ణశాస్త్రిగారికి పూలమాలలు, శాలువలు, ప్రశంసలు, ఈవరకు ఎన్నో సన్మానసభలలో లభించాయి. ధనవిషయంలో కూడా వారికి లోటులేదు. ప్రతి తెలుగు ఇంట, వారి రచనలు పుస్తకరూపంలో అందించగలిగితే, కృష్ణశాస్త్రిగారి యెడల మాకు గల భక్తిగౌరవాలు వ్యక్త పరచడమేగాక, తెలుగుసాహిత్యానికి ఓపినంతవరకు సేవ చేసినట్లవుతుందని సన్మానసంఘం భావిస్తోంది. ఈ ప్రచురణలు రసజ్ఞులందరూ అభిమానంతో కొని, మా కృషికి తోడ్పడతారని మా ఆశ -

ఇట్లు,

మద్రాసు.
జనవరి, 1976

దేవులపల్లి కృష్ణశాస్త్రి సన్మానసంఘం

దేవులపల్లి కృష్ణశాస్త్రి నన్మానసంఘం

కన్వీనర్లు :

శ్రీ ఎమ్. ఆనందం, M. P.

శ్రీ పి. వి. రమణయ్య (రాజా)

ఆర్గనైజింగ్ కమిటీ :

డా॥ పి. వి రాజమన్నారు

పద్మభూషణ్ డా॥ ఎమ్.
వెంకటరంగయ్య.

డా॥ బి. గోపాలరెడ్డి,

శ్రీ ఎస్. బి. పి. పట్టాభి
రామారావు. M. P.

పద్మభూషణ్
డా॥ బి. యన్. రెడ్డి

పద్మవిభూషణ్ డా॥ శ్రీమతి
దుర్గాబాయి దేశముఖ్

శ్రీ నార్ల వేంకటేశ్వరరావు

శ్రీ ఎ. ఎన్. రామన్

శ్రీ బి. కృష్ణమూర్తి

శ్రీ వి. బ్రహ్మయ్య

శ్రీ యం. యన్. రావు

శ్రీ బి. రజనీకాంతరావు

శ్రీ డి. రామచంద్రారెడ్డి

శ్రీ ఎన్. ఎమ్. వై. శాస్త్రి

శ్రీ ఎమ్. ఎస్. రెడ్డి

శ్రీ విద్వాన్ విశ్వం

శ్రీ డి. పీతారాం

శ్రీ గోరాశాస్త్రి

శ్రీ ఎ. కె. ఎస్. రావు

శ్రీ ఎమ్. వి. శాస్త్రి

శ్రీ విజయరాఘవరావు

శ్రీ డి. ఆంజనేయులు

శ్రీ తారకం

శ్రీ టి. వి. కె. శాస్త్రి

శ్రీ ఎ. రామబ్రహ్మం

శ్రీ వాకాటి పాండురంగరావు

ప్రెజిడెంట్ :

శ్రీ ఆర్. కె. రావు

అభినందన సంచిక ముద్రణ :

శ్రీ పాలగుమ్మి పద్మరాజు

నా మాట

1

ఏ నాటివో ఈ నాటికలు;
ఎప్పటివో గాని ఈ పద్యాలూ, పాటలూ
ప్రసంగ వ్యాసాలూనూ।
ఎప్పుడెపుడో గిలికినవీ బరికినవీవి.

దూరాన నుంచి వెన్నంటి వచ్చాయి, ఎవరో చిరపరిచితుడైన
బాటసారి పదధ్వనుల లాగున - నన్ను వదలకుండా।

2

మా అన్నగారు శ్రీ శివశంకరస్వాములు నా 'కృష్ణపక్షము' 1925 లో అచ్చు వేయించేసేరు. అప్పటికి ఆయనకు అందివ నా వద్యాలన్నీ - కొన్నిటిని వదలివేయాలని నే నంటున్నా వినక - ఒక ధోరణిలో కూర్చి, తమ సింహావలోకనంతో ముద్రింపించేసేరు. 50 ఏళ్ళు అయింది. అలాగే నా సోదరుడు ముద్దుకృష్ణ 'ప్రవాసము-ఊర్వశి' అనే గ్రంథాన్నిని - 1928 లో. ఎవరో ఒకరు తామే పట్టు వట్టి పూనుకువి చేయించాలి, నా చేత ఏ మంచిపని అయినా.

దాదాపు పాతిక సంవత్సరాలక్రితం ప్రారంభం - నా రచనలు అచ్చువేయించి తీరాలని ఆప్తులు ఒత్తిడి చేయడం. ప్రాణాధికులైన కాటూరి వేంకటేశ్వరరావు, మరి పాలగుమ్మి పద్మరాజు, ఎస్. వి. పి. పట్టాభిరామారావు, ఎమ్. ఆర్. అప్పారావు, నార్ల వేంకటేశ్వర రావు మొదలైనవారు - అచ్చుకావి నా రచనలన్నీ పుస్తకరూపాన ప్రకటించా లంటూ గట్టిగా పట్టుకునేవారు. ఇక నా ఆప్తమిత్రులు బెజవాడ గోపాలరెడ్డికి కనబడిడం భయం- 'యేవండీ పుస్తకాలు?' అని మొట్టమొదటి ప్రశ్న. అయినా వదుగురిలో వీనిని పడవేయడం వడలేదు.

3

ఏదో బెదరూ, భయం ;
వల్లమాలిన బిద్ధకమూ.
కొంతవరకు, జమీందారీ సావాసంవల్ల వచ్చిన ఉపేక్ష కూడాను.
తరుముకు వచ్చిన ఏ రేడియో ప్రోగ్రాంకో ఆ సమయానకు,
గబగబ ఏ రజనీకాంత రావుకో, ఓవరామా రావుకో, కురిమెళ్ళ వేంకట రావుకో నేను చెప్తుంటే వ్రాసినవీ, లేదా ఏ ప్రయాణంలోనో, నడుస్తూన్నో చిన్నచిన్న కాగితాలమీద వంకర టింకరగా గీసినవీ రక రకాల రచనలు ఇవి.

మరి అచ్చు వేయించాలంటే తిరిగి ఒకసారి చదువుకోవాలి-సంస్కరించాలి - సాధ్యమైనంతవరకు ఏ లోపమూ లేకుండా నిర్మించాలి - ఇది నా సంకల్పం. పద్మరాజు నిర్మొగమాటి. ఖచ్చితంగా 'ఇది బాగుంది, ఇది బాగా లేదు' అని చెప్పేస్తాడు - ఎవరి రచన అయినా సరే ; గొప్ప మేధావీ, సాహిత్య రసవేత్త, రసజ్ఞుడు - అతగాడే వీనిని వేయమంటున్నాడే ;

ఇంతలో మూగతనం వచ్చిపడింది నాకు.

Grow old along with me అని బ్రౌనింగు దాలా ఉల్లాసంగా అన్నప్పటికీ, ముసలితనం చెడ్డది.

ముసలితనంలో మూగతనం భయంకరం - శిథిలమందిరంలో అంధకారం లాగున.

ఏదో తోపేస్తున్నాను బ్రతుకు - 'దినములు పరస్పర ప్రతిధ్వనులుగాగ' - అనాటి మా వేదుల లాగున.

I am like the road in the night listening to the footfalls of its memories in silence అని రవీంద్రుడన్నట్లు-

'దీపకాంతిలో కిటికీ
దిగువ నెవ్వరా గోష్ఠి ;
నేను - నా పీఠ'

అని వఝీకాంతరావు అన్నట్లు.

4

ఇలా ఉండగా 1964 లో నా ప్రాణమిత్రుడు దొడ్ల రామచంద్రారెడ్డి హైదరాబాదు వచ్చి నా వచనరచనలు కొన్నిటిని తమ్ముడు ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి చదువుతుంటే విని, నా వైపు చూడకుండా, వానిని అలాగే పట్టుకొనిపోయి, కావలిలోని విశ్వోదయ సంస్థద్వారా అచ్చు వేయించేనేడు- నాకు మాత్రం ఎందుకో నా వచన రచనలు నా పద్యాలకీ గేయాలకీ తీసిపోవు అనిపిస్తుంది.

అయితే, పద్యాలూ, ఎన్నో గేయాలూ, నాటికలూ, యక్ష గానాలూ, వ్యాసాలూ ఉండిపోయాయి.

5

ఇంకలో ఒకాయన నా జీవితంలో ప్రవేశించాడు, చీకటింటి కిటికీలూ తలుపులూ తీసి వసంతకాలపు ప్రభాతవాయువు లాగున. ఈయన ఎవరిద్వారా విన్నాడో నా సంగతి, నా రచనల సంగతీవి:- నాతో అనలేదు, నన్ను అడగలేదు - ప్రముఖులూ పెద్దలూ అయిన కొందరితో సంప్రతించి ఒక సంఘం ఏర్పరచాడు - నా ప్రియసోదరుడు మామిడిపూడి ఆనందం తనకన్నా ఉత్సాహంగా, పట్టుదలతో ఉన్నాడనీ - అంతే కాదు, నా పరమగురువులు వెంకటరంగయ్యగారు కూడా ఆదేశించారనీ, తమ యత్నాన్ని ఆశీర్వదించారనీ అన్నాడు -

ఈయన శ్రీ పి. వి. రమణయ్య- స్నేహితులం అందరమూ 'రాజా' అంటాము. 'నేనేమీ చదువుకోలేదు, నా కేమీ తెలియదు' అంటూంటాడు. అదేమో నాకు తెలియదుగాని, అతనికి ఒక వింత సంస్కారం ఉంది, అతని మూర్తికి సుకుమారమైన ఏదో పరిమళం వంటిది ఉంది; నన్ను చాలా గాఢంగా ఆకర్షించింది -

కాగితాలధర భయంకరంగా ఉన్న ఈ రోజులలో కొన్ని సంపుటాలకు సరిపోయే కాగితం కొని ముందే తెచ్చేశాడు. ఎవ్వరూ చేయని పని, చేయలేని పని ఈయన చేసేశాడు.

ఈయనకు మరొకరు తోడయ్యారు, ఆసాధ్యుడు, శ్రీ యం. యన్. రావుగారు. అచ్చు వేయించేభారం తనమీద వేసుకున్నాడు -

అనటం. అచ్చుగాని తెనుగుగ్రంథం ఈయనకు అందడం భయం। - ఎంత అభిమానం నా యెడ ఉంటే. ఎంత మక్కువ ఆంధ్రసాహిత్యం మీద ఉంటే. అంత పనుల ఒత్తిడిలో. ఈయన ఈ పనికి పూనుకుంటాడు।

ఇద్దరూ కలిసి నావద్ద ఉన్న రచనలను - చిత్తు కాగితాలనూ. చిలర పీలికలనూ-పట్టుకొని వెళ్ళిపోయారు.

వీరికి ఎంత శ్రమకలిగించానో। కృతజ్ఞుణ్ణి అని వేరే చెప్పి వీరికి అన్యాయం చేయను.

మరి - రాజాకీ. యం. యన్. రావుగారికీ నాకూ మధ్య. వీరినికీ నాకూ మధ్య ఆసులో కండెలాగున తిరుగుతూ. మిత్రుడు శ్రీ ఆర్. కె. రావు. తన పనులన్నీ మానుకుని తెగ కష్టపడుతూ. వన్ను విశ్రాంతిగా ఉండనీయక తాను విశ్రాంతి తీసుకోక. బాకీ వసూలుచేసే కాబూలీ లాగున. నన్ను పట్టుకుని ఈ పని అంతా నడిపిస్తున్నాడు.

ఇక చిరంజీవి వీరికాంతరావు మహాకవి కుమారుడు. తానే మంచికవి. సాహిత్యవేత్త. బాగా చదువుకున్నవాడు - నా యెడ గాఢానురాగం అతనికి. నా మేనల్లుడు వింజమూరి శివరామారావు ప్రెస్సుకాపీలు తయారుచేసిపెట్టగా. తాను సంపాదకబాధ్యతలు పైన వేసుకొని. ప్రూఫులు తానే పట్టిపట్టిచూస్తూ. అవసరమైన మంచి దిద్దు బాట్లు చేస్తూ చెప్పలేనంత శ్రమ పడుతున్నాడు.

ఈ గ్రంథాలకు ముఖచిత్రాలు వేసినవాడు నా కుమారుడు చిం బుజ్జాయి అనేసుబ్బరాయశాస్త్రి.

వీడూ. చిరంజీవి వీరినీ నూరేళ్ళు హాయిగా వర్ధిల్లాలి.

వీరందరికీ - ఎందరికో - నా యెడ ఈ అకారణమైన అనురాగం ఎందుకో।

అందరికీ కృతజ్ఞుణ్ణి.

కృష్ణశాస్త్రి

పద్యానుక్రమణిక

మా అమ్మ	....	1
హాఫిజ్	....	4
గొంతు చీకటి	....	6
పిలి దారాలు	....	7
సంక్రాంతి	....	8
అయ్యో మనిషీ	....	13
ఉమర్ ఖయామ్	....	14
విజయవాడ గగనవాణి	....	17
స్నేహక్షీరము	....	19
గురుదేవుడు	....	22
బ్రతుకంత వర్షాగా	....	25
ఏమి మిగిలె	....	28
మహాత్ముడు	....	30
వల్లకీ	....	33
అశోకము	....	35
ఓహో వసంతా!	....	37
శ్రీ	....	44
అనుకోని అతిథి	....	46
తిరునాళ్ళ చేమంతులు	....	47
నిగమశర్మ	....	49
ధనుర్దాను	....	52
మళ్ళీ	....	54
ఆగస్టు 15	....	56
ఉగాది	....	60
యువగీతం	....	64
రేడియో	....	66

జీవన శంఖం	....	67
చరణసన్నిధిని	....	70
నవ్యశక్తి	....	71
తుషారాద్రి నిద్ర	....	72
అప్పుడుగాని అరుణోదయం కాదు	....	74
మబ్బు మళా	....	76
హాలికుడు	....	77
భావకవి	....	80
రాజా రామమోహనరాయ్	....	84
సుప్రియ : బుద్ధభగవానుడు	....	85
మాట-మౌనము	....	89
బ్రహ్మర్షి మాట	....	91
అందవోయి నాకు	....	97
జరలేని దా యౌవనమ్ము నిమ్ము	....	99

మా అమ్మ

"దులివి దులిపిన తరుగదు ధూళి; తుడిచి
తుడిచినా బూజు ప్రాజుట్టు విడదు; కోణ
కోణమున ఇర్లు మూర్లు; పురాణ మీ ది
వాణ మెవ రిచ్చిరో యీ అభాజనులకు!

చేరి, ఎగసన ద్రోసి, స్నేహమ్ము వోసి, లే
పేవారు లేరు నటింటి దీపికనె న-
ఆలసతాజంబాల మందు కొందరు స్రుక్కి-,
కలహ వాగురుల లోపల అందరును చిక్కి!

పాడరిన పీటిలో నీడలను నీడలై
ఏడువను లేదు బ్రతు కీడువను లేదు-
ఓడిన ఎదల హత్తి, వాడిన ఎలుంగెత్తి,
నాడు విడనాడిపోయిన దేవి కోసమై!

మనసారా ఒకసారి వేడరే"—
అని, లోలోన తలంచినంతనే,
కదలే రెవ్వరొ వీను పొంతనే,
శిథిలాలయ గేహళి చెంతనే!

గదిలో మూలల మూలల
పొదివిన చీకట్లు ముదిసి ముదిసి కరడుగై
కదిసి హతాత్తుగ బెదరుచు
చిద్రుపలు చిద్రుపలుగ చెదరి చెడిన ట్లయ్యెన్;

పొడుపు బంగరు వెలుం గొడలంత పూసిన
సరణి క్రొంబిసుపు పచ్చని మొలాము,
ఆకాశ ఫాల మధ్యాన దిద్దిన క్రొత్త
అరుణ మండలము చెందిరపు బొట్టు,
తొలి ప్రొద్దు పులుగుల కల కూజితములైన
కాలి యందెల కడియాల రవళి,
ప్రత్యూష తుహినార్ద్ర పారిజాతము వోని
కరుణారస స్విన్న దరహసితము,

కడల ప్రాక, నెనరు పాలకడలి దాల్చి
ఒక్క కేల, అభయముద్ర ఒక్కకేల
అవధరించి, నిశాంతాన అవతరించె
వత్సల మదంబ సౌభాగ్యవతి శుభాంగి:

శిరసెత్తెను శిథిలమ్మయి
కరగే దీపమ్ము, జాలకమ్ముల తలుపుల్
తెరచిన యట్లాయెను, నర
నరాల ప్రవహించె జీవనదు లందరకున్:

పల్లకీ

కవకవలై నవునవ్వుల
దివియలు వెలిగించి రింట, దేవి పదములన్
పువుదింతులుగా శిరసులు
తవిలించి గృహస్థు లనిరి తాత్పర్యమునన్:

"చిదికినవి, వికృతమైనవి,
ముదిసిన వే నాటి కుంచబో మమ్మా, ఈ
ప్రిదిలిన మానవ గేహము
గదియింతుము సుభగ శుభ జగత్తుగ నింకన్!"

హాఫిజ్

వేటోక విరియు; నెచ్చెలులార యిను డెగయు!
లజ్జావతి యుషస్సు రజత సీహారాంశు
కాంచలమ్ముల మౌక్తి కాంసమ్ము గప్పికొను!
ప్రాభాత కలధౌత పాత్ర తెండో చెలులు!

హిమ పాండుర మ్మయ్యె సుమలత కపోలమ్ము!
ఉదయవాసిత మయ్యె వసుధాసుధాననము!
అమరసీమాలసానిల వీచికలు వీచు!
త్రావుడా మరల నూతన దినోదయ వేళ!

మరకతాసనముపై కొలువున్నది గులాబి!
పరచి రుజ్జ్వల విపుల శాద్వలంపు తివాసి!
అరుణ మందారమో అనలప్రవాళమో
మధువు! సాకీ! మధువు! మసల దీ తొలి ప్రొద్దు!

ఏల ఈ పుధుశాల నేరు మూసినవారు?
చాలు! ఈ ప్రొద్దునా సాల మూయగలారు?
హే కవాటవిపాటకా! కృపాళూ! వేడు
వార మీ ద్వార మీవే తీయుమీ, నేడు!

అద్భుత మ్మన్యాయ మక్కటా! మాధ్వీక
మందిర ద్వార బంధన మేల శుభవేళ?
త్రాగుడా యిట నీ గులాబి పొదరింటిలో!
సాగు జీవన జీవనమ్మె యీ యూటలో!

ఈ గారడీ పాత్ర ఇది సికందరు ముకుర,
మిందు ప్రతిబింబిత మ్మీ విశ్వవలయమ్ము!
ఈ మంత్రి తాక్షులకు ఇది విచిత్రమయమ్ము!
ఇందు గ్రోలగ దొరకు విశ్వవిజ్ఞానమ్ము!

అరుణ సుమవల్లిలో నరుణ మాధ్వీపాన,
మరుణోదయమ్ములో నరుణాధరాస్వదన,
మిట్టి పూవుల నంటి యే మధుప్రత మాను?
ఇట్టి జీవిక లంటి యే చక్రవర్తి మను!

మరల హాఫీజ్! మరల మధుపాత్ర మధుపాత్ర!
మరిమరి ప్రియాన నాన్వేష ణోత్సవ యాత్ర!
ఏనాడొ ఏ వింత సీమలోనొ తొలంగు
నీ క్షమాద్భుతహస్తములసే సకిముసుంగు!

గొంతు చీకటి

నాటి యామని వరువాత తోటలోన
పాటలో మేలుకొన్న స్వప్నములు, మూగె
పాటల పలాశములు, నా గవాక్ష వీథి
నా నయనముల నుండి, నాలోన నిండిఃు

ఎంత మెత్తని యడుగుల నేగుదెంచి
నావొ నాకయి నా కుటీరాజిరమున
"నేను రావచ్చునా" యన్న నీ పిలుపు వి
నంబడదు నాటి యూహాంగణముల జొచ్చిఃు

పోయె నా కోయిలల కారు, పోయెను నవ
మల్లికల వేళ, శ్రావణ మ్మా శరత్తుఃు
మూలమూలల ఈ పర్ణశాల నేడు
హిమపదాంకములే తలలెత్తి పిలుచుఃు

జీవితము మృతిగా, సుప్తశిలగ గుండె,
గొంతు చీకటిగా, పిల్వ కొసరి రాక
"నీవు రావోయి" అని పిల్వనేర కిపుడు,
"నేను రాలే" నటం చేడ్వనై న లేనుఃు

నీలి దారాలు

నీలి నీలి దారాల తారా లతాంత
మాల లల్లును నా ప్రియురాలు రేలు!
పువుపువుగ విడదీసి, మబ్బుల చెరంగు
కొసల ముడి వైచి, యొడి దాచికొను పవళ్ళు!

ఎన్నడును రాని నాకయి యెదురుచూచు
నా సకియ జీవితము సుంత నలగబోదు!
ప్రతినిశా చంచలా చల ల్లాస్యము లయి
పరువులిడు నామెవ్రేళ్ళతొందరలు నాకు!

సంక్రాంతి

"వినఁ నిష్టపడను, వినకు
న్నను తోచదు, విన్నచో మనస్సు వికలమౌ
దినదినము గగన వాణీ
స్వన వీచీ నివహ వాహ వార్తావళులన్:

కొరియా రణ మ్మనుచు, మలయా ద్రవ మ్మనుచు,
కురిపి రణ్వాస్త్ర భీకర పరంపర యనుచు,
దరియు సంగ్రామమని, వరదలని, వరపులని,
కరవు కాటకములని, మరణమని, మసనమని!

ఈ లోకమ్ము దరిద్రతా కృపణతా హింసా రిరంసా రుషో
ద్వేలోల్లోలములన్ మునింగి విల యాభీల స్థితిన్ మాయునే
మో - లేకున్న సహోదరాస్థి పలలమ్ముల్ తిందురే యెందుఁ త
త్కాలా లాసవ పాన లాలస మదాంధీభూతులై మానవుల్:"

అని తలంచి కొనుచు అల్లన శయ్యపై
ఎపుడు తార్చినానొ ఏను మేను -
నిదుర దారులంట కదలుచు కలచుచు
పిలు పొకండు మేలుకొలిపె నన్నుఁ

ముని వాకిట నిల్చి దేకొసన్
ముసిరే చీకటి నీడ లార్చుచున్
జరఠచ్ఛదపక్ష్మవిస్రవ
త్తరణాజస్రహిమాశ్రు లోడ్చుచున్ —

తోచె నింబతరువు, తోచెను దూరాన
భోగిమంట చుట్టి మూగు నీడ,
లరుణదారుణాగ్రహాట్టహాసము రేప
ముసిరిపోవు వంతమసక లట్లు!

అంత మెత్తని చేయి నా యంస పాళి
తాకిన ట్లయ్యె: మరియు మెత్తని రవమ్ము
పూదిన ట్లయ్యె చెవి పొంత, ఉండి ఉండి
సీతువున దోచు తొలి చైత్రగీతి వోలె!

"ఏమండీ! ఇక లెండి! వాకిటికి రానేవచ్చె సంక్రాంతి, ఏ
మేమో ఎన్నడు యోచనల్ తెగవు మీ, కీలాగు కూర్చుందురం
డీ! మానండి దిగుళ్ళు మీ మనసులో! ఈ లోక భారమ్ము మీ
రే మోసేరె? సుకమ్ముగా నడపలే రీ కాస్త సంసారమున్!

ఉండునో ఊడునో మరెపుడో విలయావసరమ్ము నందు బ్ర
హ్మాండము లంచు వేడుకలు మానుదురా ఇపు డెవ్వరేని? ఏ
పండువులో ప్రతిక్షణము పబ్బములో ఇటు రావొ—ఆసలున్
పండిన కోరికల్ పసిడి స్వప్నములున్ వసివాడి పోవవా?

మన చిన్నసీత లేవనె లేద, గోమయ
హిమవారి కలయంపి యెవ్వ రిడిరి?
కూర్చున్న వప్పుదే కొలువులో గొబ్బిళ్ళ
వన్నె వన్నెల రంగవల్లు లందు!
ఎందుకో తొందర లీ బంతి పువులకు
కొమ్మల రవ్వంత కునుకిరాదొ?
ఎలమావి లేత యాకుల తోరణాల గు
మ్మాల బుజ్జాయా కాబోలు కూర్చె!

పండు వాయెను - ఎటు లూరకుండు, మాయ
మసక లెరుగని పసికందు మనసు లాయె:
కలలొ కోరికలో పూలు కాయ లగుచు
ప్రాకికొనిపోవు ఆ బీరపాదు లట్లు!"

మెడ చుట్టి మంచులో తడిసిపోయిన ముద్ద
బంతి కడాని లలంతికలును,
బుజములపై గుత్తముగ నొత్తియుండని
తెలిచీర చెరగుల మిలమిలలును.
పచ్చ పచ్చని పైరు పరికిణీ మడతల
సగము కన్పడెడు సెనగ పువులును,
కెంగేల జాళువా గిండిలో బిస బిస
మని పొంగు మైరేయ మాధురులును,

కేతనముపై హసంతిక, శీతవాత
వీచికా సైంధవమ్ములు, వెడలివచ్చె
సుందరమ్మ సేవంతికా స్యందనమ్మ
పైని సంక్రాంతినాటి ప్రాభాత లక్ష్మి!

తలయెత్తి చూతునుగదా దవులందు పారున్
చలికారు ఈదర హామాయి పయిన్ బయళ్ళన్-
వలిపంపు మంచుముసు గంచులు తేలిపోగా
చలియించు లోధ్రసుమమేఖల తూలిపోగా!

దవులన్ దోచెను నవమా
ధవ మాగధ గీతు లంత, తరుణి పెదవులన్
మివులన్ బూచిన మంకెన
పువులన్ తొలినాటి పండువులు స్ఫురియించెన్!

నా యింటి ముంగిటను, నా
ప్రాయపు వాకిట, వలగ్నలగ్న శ్రీ చాం
పేయ మధు పాత్రతో సతి
తీయని సంక్రాంతి లక్ష్మి తెరగున తోచెన్!

"మున్ను హిమవేళ పోర్దోల ఉన్న వగరు
పొగలా, మృగమద వీటికా భుగ భుగలు, ప్రి
యాంగనాలింగనాలు; నే డవసరములు
కుంపటులు దుప్పటులు మాకు కుప్పసములు!"

మసరు సరసా లంత మగువ చెవిలో సుంత
గుస గుసలుగా నెవో కొసరితినొ లేదో -
మిస మిసల యెలనగవు లొసపరి పెదవి దాచి
విసరుకొను చిల్లాలు వీటి లోపలి కేగెఁ

ఈ యెయ్యో మనిషి

త్రేలు కుడుతుంది - తోడేలు హింసిస్తుంది—
తీతు వెవ్వరినైన తిడుతుంది।
లోన అంటుడు పురుగు ప్రాణం హరిస్తుంటె—
పైన ఆటంబాంబు పడుతుంది।

ఎందు కీ గతి జగతి కీలాగు పడుతుంది?
ఎందుకు శ్మశానమై చెడుతుంది?

క్షుద్రతి త్తిరి కుటిలవృశ్చిక క్రూరవృక
రుద్రమారణయంత్ర రుగ్మతలు తానైన
మనిషిలోనే పెద్దమడ తుంది।
మనిషికే పెడబుద్ధి పుడుతుంది।

బోదెలో ప్రేమనే పాలు పోయడు కాని
మ్రోడు మందారాలు పెడుతుంది।
అటు చాపి ఇటు చాపి అభయహస్తా లల్లి
జగమంత పందిరిని కడుతుంది!

ఈ మ ర్ ఖ య మ్

(నాటిక నుండి)

ప్రరచి గుల'బి పూవులు తివాసిగ, పై మధుపాత్ర నుంచి, ద్రా
క్షిరసము నించి, దాన నిడి కప్పురపుం బలుకుల్ రవంత, పై
శిరహిమవారి పైజిలికి, చెచ్చెరపొ మ్మరుణాసవమ్మునన్
దిరిసెనపూవు మంజరుల నీడల జూచుచు మెల్ల ద్రావెదన్:

వీడని వేడి కౌగిళులు వేసరివోవని వేళ పోయె, ఏ
జాడల నీని స్వప్నముల చాటున నీడల రెక్క-లార్చి; ఈ
నాడు వియోగపుం బ్రతుకు నాశము వోకయె చీకటింటి త
ల్పాడిచి తొంగి తొంగి ఇపుడో అపుడో యని వేచు పిల్పునై:

ఒండు కాచపాత్ర తెం, డంత నింపుండు
దాని వాయిదాక ద్రాక్ష రసము:
దాన వీని దింపి తక్షణమే బిర
డా బిగింపు మో మిటారి సాకి:

వీని పన్నుండ బెట్టుడు: వీని నేల
నంటగట్టుడు, పీపాల వెంట తెరచి
వాయి పోయుడు పచ్చి సారాయి, చెవుల
ముకుపుటమ్ముల చినుకుచినుకులు రాల:

మ్రోయవు చైత్రమాసపదముల్ హరిదంత పదప్రమ్మలందు, శూ
న్యాయత నాంగణాన మిహికాంగముతో చలికారు తొందరల్
సేయును వెంట వెంటబడి చీరగ శైశిరశీర్ణపర్ణపా
తాయతరోదనమ్ములొ జరామయ నిశ్వసనస్వనమ్ములో!

అధరసీధు వేదొ ఆసవం బేదొ యె
రుంగ లేడు గాదె, దొంగ వోలె
ఏల చొచ్చె పానశాల, గులాబీల
పాళ కంటకమ్ము వోలె వీడు?

ఎక్కడనుండి జారె నిట, నెన్నడు సన్నగ జేరె, విన్ను పై
చుక్కలు పాన పాత్ర, నిది చోద్యము, నెచ్చెలి కాదఁ త్రావినన్
నక్కనొ యేమొ నా కదుపునన్! గళనాళము లోన, అక్కటా,
చిక్కనొ? మీకు చిక్కనివి చీకటులే మిగులున్ గుడారునన్

ఆసవమున్ ప్రియాంగన వనాంతరవాసము మా కొసంగి, నీ
కోసము స్వర్గ మున్న దనుకో! పొలిమే రొకసారి దాటినన్
మోసము సుమ్ము: మాకనుల మోసల నున్నదియే నిజమ్ము; పే
రాసలె త్రావి నిల్పగలమా కలకాలము మాదు జీవముల్!

ఒక మధు పాత్ర ఒక్క సఖి యున్న నిషాకు ఖుషీకి, ఈ ప్రపం
చకము సమస్త మేలగల జాణవురా అవురా ఖయామ! నీ
రకముగ "జెంషి"దైన, "బయిరా"మయినా బ్రతుకంత నొక్క షెన్
సుకముల మూటగా సలుప నోచెనె? దుఃఖము లెల్ల త్రోచెనే?

భళిర భళీ ఖయామ! శహబాసుర! - ఎన్నడు దూరె నౌర బు
ల్బులు మధు పాత్ర నుండి పిలుపుల్ వినవచ్చె: అరే అరే గులా
బుల పొద యందె పూచె నగవుం బువుగుత్తుల! వారె వాహవా!
చెలియయు నిందె దాగె ను చెక్కిట పాటలఛేన మంటగా!

అదిగదిగో గుడారమున కావల ఈ వలయమ్ము మూసి, పెన్
కొదమ ఇరుల్ సమాధికడకున్ నను పిల్చుగదే పదే పదే!
బెదరును సుమ్ము సుంత, పెదవిన్ మధురాసవ పాత్ర యున్నచో
తుదిమన వొండు సాకి - వినుతున్ దయసేయుము నీ ఖయామ్ముకై!

ఒక్క గులాబి తోట విరియోవరి నీడ మరేరు త్రోవరుల్
త్రొక్కని జాడ లేత చివురుల్ పరపింపుము నాకు సెజ్జగా!
ప్రక్కన ఉంచు ద్రాక్షిరస పాత్రిక ఉన్న క్షణమ్ము లింక, కై
పెక్కిన దాక త్రావుచు శయించెద నే తుదికన్ను మూతకై

తలిమమునన్ కపోష్ణ మధు ధారలు పోయుము; నే శయించినం
త లలిత పాటలమ్ములు ననల్ పయిదుప్పటిగాగ కప్పు: క్రే
వల సరి క్రొత్త యత్తరుల వాకలు వాకలు తీర్పు; చెంతనే
విలుపు మనుంగు నెచ్చెలుల; నిద్దురలో బడిపోదు హాయిగా!

ఏలా వచ్చె హవా హుమాయిపయి వాడే కుచ్చుపాగాల షో
కేలా, పచ్చ జరీబుటా మొఖమ లంగీ దాల్చి చైత్రుండు - కెం
గేలన్ సోగ గులాబికొమ్మ కొరడా కీలించి, సారా నెరా
ప్యాలా సారెకు సారెకున్ పెదవులన్ బిట్టించుచున్ నవ్వుచున్!

విజయవాడ

గగనవాణి

ఇప్పు డీ కృష్ణయెడ్డున ఈ విజయవాటి
ఇట నొక్క తెన్నుకవి యెలుగెత్తితే.
అటు పంప, ఋషికుల్య యాటు- ఈ నడిమి స్వర్గ
మందు నా ముక్కోటి యనుగు తెనుగులు
విందురా? అందరూను!

పలనాటి, వెలనాటి, అల పాకనాటి, రా
యలనాటి గరువాల జిగులు బిగిసే నాట,
మన కళింగాన, మాయని తెలంగాణాన,
మన తెన్గు చుట్టాలు వినగల్గితే.
ఈ రేయి
ఇట నొక్క తెన్నుకవి యెలుగెత్తితే!

ఏటి పొత్తిట శయించేటి పల్లెల, కొండ
ఘాటీల నిద్రపోయేటి పల్లెల, మావి
తోట దుప్పటి నొత్తిగించు పల్లెల, పైరు
చేల పానుపుల పల్లియల తెన్గువా

రెందరో - అందరూ వినగల్గితే -
ఇట నొక్క తెన్గుకవి యెలుగెత్తితే!

కుడిచి కూర్చుని రాని కూరుకున పేరుకుని
ఒడలోము సామంతులూ మంత్రులూ గాక,
దారి దూగర బ్రతుకు లీడ్చువా రేడ్చువా
రార నాకట నంగలార్చువా రూర్చువా
రెందరో - నా గుండె నిలుగట్టుకున్నవా
రెందరో - అందరూ వినగల్గితే -
ఇట నొక్క తెన్గుకవి యెలుగెత్తితే!

మంచి గతమున కొంచెమేననీ, ఇక మంచి
మంచి వార్తలు కడలినుంచి వచ్చేననీ,
గడియ గడియకు కొత్త జగము లేపుచు, కొత్త
కడిమి చూపుచు, కొత్త కొత్త మానవుడు పెన్
ధూళినుంచీ కుటీ పాళినుంచీ కదలి
నేల నేలల మూల మూలలం దెగసెనవి
మన తెన్గునేల ప్రతి మానవుడు వింటేనా:

స్నేహక్షీరము

చిననాటి భావవల్లిని పూచినది, వాడ
నిది, వాసనల వీడనిది, ఒకండు
కోరిక - నాల్గుదిక్కులఁ భూభువనమంత
లవలేశమును వదలకయె తిరిగి,
ప్రతిగేహగేహళి పదమూగి, ప్రతి హృద
యద్వార తోరణ మట్టె క్రోపి,
లోనికి జొచ్చి, నాలోని స్నేహక్షీర
మొక్కింత ఒక్కింత ఒలకబోసి,

"అనుగు సోదరఁ మరలిరానా" యటంచు
నెల వడిగి సాగిపోయెడు చిరపథికుడ
కావలయునంచు, ఆశ ఆకాశమంత;
పటిమ దీనవిహంగ మిప్పటికి అంతె!

ఘర్మ గంగాయురీ ధర్మ గోదావరీ
పిక్త సహజీవనాసక్త భారతభూమి
నొక్కపరి హిమశిఖరి నెక్కి సేతువుదాక
దృక్కు సారించి, పూరించి గళకాహళిక -

విధుర ప్రియ శ్రవోపీథుల మంగళ
స్వాదు వాక్యమ్ముల నూదగలను:
విలుపగాగలను మాణిక్యదీపావళి
అంధమనోమందిరాంతరములఁ
కర్కశహృదయజాంగలముల శీతల
స్నేహదుగ్ధమ్ము వర్షింపగలను;
విరచింపగలను విద్వేషవైతరణికి
అడ్డుగా గాఢసౌహార్దసేతు:
విటనె నిలిచి, సమస్తదిక్తటుల పిలిచి,
సారెసారె జీవత్సరస్వతిని మలచి,
కవిని నేనై పురాణ వైణవికునట్లు
ఊహలున్న, జగమ్మంత స్నేహమున్న!

నిన్న మొన్నదాక మన్నులో మన్నయి
యున్న ప్రాణశంఖ మొత్తినాడు
మానవుండు, గర్వ మాణిక్య కోటీర
ధారి నేడు - విజయహారి నేడుఁ

ఈనా డీ భువి బానిసీడు మరి లేనేలేడుఁ ఒక్కొక్క ఫా
లానన్ పావకనేత్ర మున్నది పగల్ కాల్పంగ - ఒక్కొక్క డెం
దానన్ క్షీరసముద్ర మున్న దవధుల్ దాటంగ - ఈ మానవుం
డే నిర్మాత విధాత నేత మరి తానే భోక్త లోకమ్మునన్ఁ

పల్లకీ

"స్వస్తి జగత్తున కగు: శ్రీ
రస్తు: సదా శాంతి ర" స్తటంచు వెలయు వి
శ్వస్తుతభారతవాణి సు
మస్తబికము వోలె లోకమస్తకము పయిన్:

గురుదేవుడు

స్తామమ్మల్ ముఖరించు చైత్ర భరతక్ష్మా దీర్ఘ హేమంత ని
ద్రాముద్రావశమైన వేళల శుభప్రాభాత శంఖ ప్రబో
ధామోదమ్ముల దిగ్దిగంతముల నాహ్వానించు వైతాళిక
స్తోమమ్మున్ దయసేయు నీ కివె నమస్సుల్ రాజరాజేశ్వరా!

ఈ దివ్యర్షిపదమ్ము భారతమునందే పుట్టి, ఆధ్యాత్మికే
చ్ఛాదారిద్ర్యముచే నశించు ప్రియశిష్యశ్రేయ మాశించి, అ
వేదానంతపథమ్ములన్ కదలిరావే! తాల్చికోనిమ్ము నీ
పాదాంభోజ రజోలవమ్ము గురుదేవా మా శిరోవీథులన్!

ఈ జడజీవితమ్ము పలికించితి; వీ యఘపంకమందు నం
భోజము మొల్వజేసితి; వపూర్వము నీ దయ; ఈ నిశీథి నీ
రాజన మెత్తినావు; విపులమ్ముగు నీ యెద నిండెనే శర
ద్రాజిత చంద్రకాంతు లమృతమ్ములు స్వర్గలతాంత వాసనల్!

మా చిననాటి చిత్తము లమాయిక కోమలముల్; పదేపదే
పూచిన వాని స్వప్నము లపూర్వము; లిప్పటికేని నాటి 'సూ
ఫీ' చరితామృతమ్ము గురిపించెడు మా గురుదేవు డేలకో
తోచు షరాయితో ఫగిడితో నెవరో యొక ఫాదుశాహిగా!

నా యెదలో త్వదీయచరణమ్ముల చిహ్నము లెన్నడేనియున్
మాయవ యే నిశీథపు తమస్సులు మాసిన గాని; జీవయా
త్రాయతవీథి నొక్కడ ప్రయాణము చేయుదు నక్షయంపు పా
థేయముగా గ్రహించి గురుదేవముఖస్రుత గీతికాసుధల్

అలనాటి ఋషివాటికలనుండి పరతెంచు
ఆమ్నాయపూతగంగామృతమ్ము;
అలనాటి బోధివృక్షాయతచ్ఛాయల
పెలలైన బాష్పశీతలజలమ్ము;
అలనాటి కరిమ్రోడు సిలువగద్దియ మీద
నురలిన రక్తకవోష్ణధార;
అలనాటి ఆరబీయుల యెడారులలోన
కారిన విశ్వాసఘర్మవారి;

కలిసి వీలోన లోలోన కదలిపార,
పదనువారిన దయ్య నీ హృదయసీమ;
తావకపవిత్రజీవితధామమైన
దయ్య విశ్వవిశాలదేవాలయమ్ము!

ప్రతిఫల మ్మిసుమంత వలవక కర్మముల్
సేయు నీమెయి కురుక్షేత్ర మగును;
ఆశాంతములకు చరాచరమ్ములకును
తరణి నీ యెడద బృందావన మగు;

వివిధధర్మజ్ఞానవేణీసమాశ్లేష
మైన నీ మనసు ప్రయాగ యగును;
పాతాళమును స్వర్గపద మొక్క- ఏుడిలోన
నతుకు నీవే వారణాసి వౌదు;

నీవు కన్నడ నెదురుగా, నిల్చినట్లె
మ్రోలను పురాణభారతపుణ్యమూ ర్తి:
మాకు దినదినదివ్యయాత్రాకృతోత్స
వానుభూతి నొసంగు బ్రహ్మర్షి వీవె!

"ఏ దురితాంధవహ్నుల దహించుకపోవు జడుండ" నంచు ప్ర
హ్లాదుడ వీవె, శ్రీ శుకమహర్షివి నీవె, వచింపబోవ నే
మౌదురొ మమ్ముబోంట్లు! వెరపౌను: ముఖాముఖి నో వినమ్రమూ
ర్తీ దరిపించినాడవు గదే జగదీశుని! ఎంతవాడవో!

బ్రతుకంత పర్వగా

ఒక నిమిసంపు నిద్దురయు నొత్తని నా కనులేకు లెన్నడే
నిక ముకుళింప వేమొ చదలేటి సుమాలయి నిర్నిమేషతా
రకల విధాన, వేసటలు రాని నిరీక్షణ శ్యామికాప్రతో
శికల పదేపదే కలవరించెడు కోరిక జీల్చుచుండెనో!

ఈ శరదిందుమూర్తి హసియింపడు చల్లదనాల జల్లు లా
శాశల, ఆ దరిద్రగగనాంతరసైకతపాళి గూడ జ్యో
త్స్నాశిరమ్ము కాదు; కరిచాయల పాయలుపాయలై నిశా
కైశిక మూరకే యిముడకే ముడిలో విడబారు నెల్లెడన్!

రగులు విషాదహాలహలరౌరవకీల హృదంతరాల గ్లా
ల్పగ, ననులోన దాల్పగ భరమ్మొ, వియోగకుటీర మిద్ది నే
టి గతికి రేబవళ్ళు నొకచే పనిగా తపియించు; సోరణం
పు గనుల పల్కరించు నలుమూలల ఏడుచు బారుబారునన్!

రేయికొసన్ పపిండి నునురేకలు ప్రాకకమున్నె పైనమై
పోయెడు మూగ వీవలుల పుంతల నల్లన నేగుదెంచి, నే
నే యెలుగెత్తి నీ నిలయనిస్సరణమ్మున నిల్చి పిల్తు 'నా
ప్రేయపి - ప్రేయసీ' యని, చలింపగ యుష్మదుషస్సుషుప్తులే!

నీ యిలు మోసలన్ ముసరు నింబకషాయ పలాశ వాసనల్
మోయగలేని పయ్యెరల మూలుగొ, నిశ్వసనస్వనమ్ము, యే
మో యని మేలుకోవలవవో సకియా! దరమీలితమ్ములౌ
నీ యెద రేకులన్ బొదువు నీడలు తోడనె మూగిపోవగా!

పిలు పెడబాటు వేసటనొ, వేకువ సోకుటనో, మరేమొ, జీ
రలు వడిపోయెనో, పలుకరాక వెరంగిడె నాకె; తోచె కో
మలకరుణాలసమ్ముగ తమస్సమయాస్తమయాన నేలొ యు
ల్లలితము గద్గదమ్మునగు ప్రత్యుషసీహామకంఠరావమై!

పాడరు వెల్గులో, కొరడు వారెడు కోర్కులొ, మోడుటాసలో,
పోడిమి వీడు సౌఖ్యములొ, పోయెను పోయినవేవొ, ఈయకే
జాడలు, నిత్యనూతనవసంతములో యువజీవకాంతులో,
వాడని నందనప్రసవవాటికలో మన కింక నెచ్చెలీ!

ఈ యెద సారెసారె కిసిరింతలు వారును, సీతు సంకెలల్
వాయగ నీ మధూత్సవవిభాతశుభోదయవేళ ప్రేయసిన్
డాయగ, రెక్కలార్చి గగనమ్మునె చేరు, కరంగి పారు లో
తీయని పాటగాగ, కయి తీయని పూవుల తేనె యూటగా!

మునుకొను వేకువన్ మొగిడిపోవు నులూకవిలోకనమ్ము, మా
యని వికచప్రభాతరుచిరామరకాంతికి, అప్సరఃస్మితా
ననమధువాసనారుచికి, నా ప్రియురాలికి, అంధకార లో
క నివసనాన మే నిడి నగల్దొడి చంపిన నూరకుందునా!

ఆపగరాని యీసు హృదయమ్ము దహింపగ, కంఠమెత్తి, ఆ
శాపటలీశ్రవోవితతి జాటితి - "ఓర ప్రభాత శైలసా
నూపలనీలపాళికల నొత్తకయే స్రవియించు నా హిమా
నీపరగాయనీగళ వినిస్రుతమాధురి మంటి కీడ్తురా?"

"ఏ మృగతృష్ణనో వలచి యేడ్చెదు, వీ దురదృష్టజీవిత
ప్రేమము నీ యెడంద కొసరెక్కల కేనియు నందరాని స్వ
ర్గామృతనందనప్రసవ మయ్యెగదా, వెదుకాడబోయె డే
లా మిహికామృషాపథములం" దని రందరు నవ్వులాడుచున్!

ప్రేయసి సోయగమ్మునకు లేదు శరీరము; లేదు మేను నా
తీయని ప్రేమకేని, కలదే యెడబా టిక మాకు! శ్యామ వై
హాయనసీమ కార్తికిక యామవతీహసితమ్మువోలె నన్
బాయ దెదో వెలుంగొ - మధువాసనయో -

ఏమి మిగిలె

ఊపి ఊపి మనసు నొక్కొక్క వేదన
కావ్య మౌను, మరియు గాన మౌను:
నేటిబాధ నన్ను మాటాడగానీని
ప్రళయమట్లు వచ్చి పడియె పైనిః

ఒక్కసారి మిత్తియూహపు నట్టింటి
దీప మార్పినట్లు, పైపలేని
ఊపిరాడనీని ఒంటరితన మేదొ
శూన్య మేదొ నన్ను చుట్టుకొనియెః

నన్నుగన్న తండ్రి, నాకంటి వెల్గు, నా
యూత, జీవనంపుటూట, బాట,
నా యెడంద యోర్పు, నా యూర్పు, ననుపీడి
చన్న - ఏమి మిగిలె నన్న యింకఃా

పిలువ గుండెపైని, నెలవంక తలపైని,
మనసులోన ప్రణవమంత్ర దీప్తి:
మతములేని యతని మనుగడే మతమని
కనులులేక మొరకు కనడు గాకఃా

పల్లకీ

నా యనుంగు నేల నలుబది క్రోట్ల గుం
డియల అలల నిండి నేడు పొంగు
నా ర్తశోకరావ మరిపేద నా గుండె
దారు లొరపి వెలికి పారు నిటులఃఃః

మ హా త్మ్ర డు

మన హిమాలయాలు మన గంగలు పొలాలు
మన స్థలాలు పూలవనులు గనులు
మన అఖండభూతి మనజాతి మనసీతి
ఉన్నవరకు గాంధి ఉండి తీరుఃఃః

ఒక్క గుండె నేని ఉన్నదా ఆనంద
లేశమేని, గాంధి ఆశ విడదు;
ఒక్కగుండె యేని పొక్కునా వేదన
స్వాంతమందు గాంధి శాంతపడడుఃl

సగము బట్టలేని సామాన్యుడు ఫకీరు
తాత యొకడు లోకధాత యయ్యె;
ఏ మహత్తు లోన నిమిడించు కొన్నాడొ
ఈ యుగాన చిత్ర మీ జగానఃl

ప్రాతఘనత మీదపడి జీవితమ్ములు
నీడ్చి యేమిఃl అశ్రు లోడ్చి యేమిఃl
కదలి చన్న గాంధి గట్టిపునాదిగా
క్రొత్తజాతి కట్టికొందు మింకఃl

ఒకని కులము, మతము నొక్కని, ఒక్కని
స్వార్థ, మొకని లోభ మావహింప-
తెరలు పొరలు గాగ తీయని చల్లని
నేల నేల బూది పాలు చేయఃl

ద్వేష మున్న చోట దేవుండు వెలయడు -
మతులు గతులు తప్ప మతము లేదు.
ఒక్కకంట ప్రేమ, ఒకకంట సత్యమ్ము
వెలుగ, జగతి శాంతి నిలుపవలయుఃl

ఏను నా మహాత్ము నెంతేని పూజింతు;
అతని పెక్కు-గతుల ననుసరింతు;
కాని, అతని కన్న ఘనమైన సత్యమ్ము
తలపు పలుకు పనుల నిలిపియుంతు।

ఎల్ల యెల్లలు కరగగా, ఎల్ల కల్ల
లల్లనల్లన సురుగగా, ఎల్లజనులు
చల్లని కుటుంబిమయి మనజాలు వరకు
మా మహాత్ముడు మా గాంధి మనియె తీరు।

పల్లకీ

ప్రాణసఖుడె నా కోసమై పంపినాడు
పల్లకీ అన హృదయమ్ము జల్లు మనియె।
వీడని వియోగమున వేగు మ్రోడు మేను
తలిరు తోరణమై సుమదామ మాయె।

చెదరు చేతుల నెటొ కయిసేసు కొంటి
మొయిలువసనమ్ములో ప్రొద్దుపొడుపునగలొ।
ఏదొ కాలుచు హాయియో ఏదొ తేల్చు
భారమో యేచొ సైరింప నేరనైతి।

కొసరు నడల తూగాడుచు కూరుచుంటి
పూల పల్లకిలో పూలమాల నేను।
'ఓ' యనగ 'ఓహొహో' యన బోయవాండ్రు
దారిబడి నిల్చిచూచె ఊరూరు నాడు।

'ఓ' యనగ 'ఓహొహో' యన బోయవాండ్రు
వీటి వెలుపల మేల్కొనె తోట తెరువు।
'ఓ' యనగ 'ఓహొహో' యన బోయవాండ్రు
తోట పొలిమేర కాలువ తొణకె నిదుర।

ప్రణయవల్లకి పల్లకీ! ప్రసవభర వ
సంతవల్లిక పల్లకీ! శక్రచాప
వక్రరేఖా పల్లకీ! మధు స్వప్నశాఖ
వల్లకీ!

అశోకము

ఆ చతుశ్శాల నడిమిబయలున నిలుచు
నొక మహీజ మేకాకి వియోగి వోలె;
లోకు లందరు 'నరమావి' మోక యందు:
రిది అశోక మ్మనుచు దీని నేను పిలుతు।

ఏ యనిలు ప్రేళ్ళకో చలియించి కోటి
యాకు లొక తీగగా పాట నాలపింప,
ఆదికాలపు గాథగా నది గ్రహింప
రచటి శాస్త్రిలు, నిశితమేధాధికృతులు।

అప్పుడప్పుడు కారాగవాక్షవీథి
నలసగతి నొక్క దక్షిణానిలము వచ్చి
యలముకొనును నా లోపల; పిలుపు విన్న
కరణి పోవుదు నే నశోకమ్ము కడకు.

ఉస్సురని యుస్సురని రసోదిత నిసర్గ
గాన మొనరించు నుజ్జ్వల కరుణ గాథ-
యుగయుగమ్ముల భారత యువ హృదంత
రాళ మొరపిన నెత్తురు చాలు గలది।

నత శిరస్కుడ నై నిల్తు, నమ్రజీవ
ముంతు నాపాదపము పాదముల: ఆలోక
మొక్కపరి తోచు సీతావియోగహృదిగ,
ఒక్కపరి తోచు ప్రాచేతసోచ్చరుతిగ:

ఓ హో వసంతా!

కవి

రేగు కోర్కిల గుత్తి నా గుండె యటు లెర్ర
నెర్రనై నది మావియివురు గుబురు;
మ్రోగు పాటలపేటి నా గళమ్మటు తీయ
తీయనై నది పుల్గుతెరవ గూడు;
ననుచు నూహల డోల నా మనస్సటు పారు
నేరులై నది గాలి యోర యెరక;
ననయు తావులకోవ నా మన్కియటు సీత
హసితమైనది మల్లెయలరు తీవ;

పొడుపు వాకిలి గవను తల్పులు సడల్చి
కనబడని చేయి యేది విప్పినదో గాని,
నాలుగాశల లోపల మూలమూల
లందు చొరబడి పోయినా డామని దొర;

పువ్వులు

ఓహో వసంతా; ఓయి వసంతా;
ఓహో వసంతా; ఓయి వసంతా;
నీహారాంచల నిభృత నికాంతా;
ఓహో వసంతా; ఓయి వసంతా;

వేణువు

ఈ దారి కెలకునం దేను వేణువ నోయి!
నాదాలకోవ! ఆనందాల పెనుప్రోవ!
స్వాదు మృదులములు నీ పాదాల సవ్వడులు
ఏ దవ్వు లందైన ఏ నెరుంగగ లేన?
బెదరు నీ పెదవి యూరుపుగాలి కదిలేన-
చెదరు నీ చీర కుచ్చెల సుంత మెదిలేన-
ఆగికో లేనోయి అడగియున్నవి వేలు
మ్రోగిపోయే నోయి ముగ్ధ రహస్యాలు!

పువ్వులు

ఘుస్మణ రసాల కిసాల రసాసవ
కషాయ వికచగళా వసంతా!
మస్మణ కుసుమ హృద్గళన్మరంద
స్నపిత చరణయుగళా వసంతా!
ఓహో వసంతా! ఓయి వసంతా!
చిరతర పథికా! ప్రియతమ ప్రేమిక!

కోయిల

ఈ పర్ణశాలలో ఏను కోయిల నోయా!
నా పున్నె మీ నాటి కేని పండె గదోయి!
ఒక్క కొమ్మ గవాయి- ఒక రెమ్మ సన్నాయి-
దిక్కు-దిక్కు-ల నేడు తోట ఒకటే హాయి!

పల్లకీ

ఎవరు తగిలించారొ ఈ తీపిలో ఒగరు?
ఎవరు రగిలించారొ ఈ గొంతులో పొగరు?
నా గుండె యెరుపొ - నా నాథు పెదవుల యెరపొ-
మై గదించిన దెవరు మావి యిగురుకు తొగరు?

పువ్వులు

మల్లీ వల్లీ మరకత కాంచీ
వేల్లిత తనుమధ్యా వసంతా!
పుల్లమాలతీ పులకిత వ్రతతీ
పల్లవ మృదు రథ్యా వసంతా!
ఓహో వసంతా! ఓయి వసంతా!
అరవింద పితకుంద దళస్మిత!

తుమ్మెద

ఎలదేటినోయి స్వామీ, నేను సెలయేటి
అలలలో కదలేటి కలువపూపడవలో
ఊయాల నీ లీల నూగేను తూగేను!
నీ యోలగము వేళనే యింత మరపేల?
తరపి తేనియసోన తొరిపి మంచు జలాన
కురిపించి రెవరు క్రొవ్వారిగుండె లోలోన?
తగిలించి వలపు పుప్పొడి బూది నా మేన
బిగియించి రెవరు మోదుగు పూవు చాపాన?

పువ్వులు
వీల వీల కజ్జల సమ గరుదం
చల మధుకరచికురా వసంతాఃలోల మనోహర వీచీ విచలిత
బాల మృణాలకరా వసంతాఃఓహో వసంతాఃఓయి వసంతాఃశిశిరకుమారాఃకుసుమ మనోహరఃగాలి
దుడుకు రెక్క-ల జోడు తొడిగించుకున్నాను-కడిమి పుప్పొడి జీను కదియించుకున్నాను-దక్షిణ ప్రాంగణ ద్వాఃకవాటము వీడతెరచినావా తోటతెరువు మాధవ దేవఃకూర్చినారా సుందరీ కోమ లాలసశ్యామలాలకల నవమల్లికల దోలికలఃపేర్చినారా దారి కురవకాశోకాలు-ఓర్చుకోనే లేవు స్వామి మృదుచరణాలుఃపువ్వులు
ప్రతి విభాత హారీకృత రజత
ప్రాలేయాంబుకణా వసంతాఃప్రతి విభావరీ విరహ హృదయ ని
శ్వసన మలయ పవనా వసంతాఃఓ

వల్లకీ

ఇటు రావే నవమల్లీ!
మాగధి మాలతి శేఫాలీ!
ఇటు రావే కురవకమా!
మాకందా ఓ కింశుకమా!

వసంతుడు

కురియు మంచు నునుజడుల నడగు తెలి
యాసుక నుసుల బయళులపై
తొరయు పుప్పొడుల దొరగు తేనె యస
లొలయు చివురు తెరువులపై

పువ్వులు

ఇటు రారే ఇటు రారే!

వసంతుడు

చలిత హిమానీ లలిత తుషారము
దులిపి కొనుడు మెయి నంపెనులే!

పువ్వులు

మధుర మధుర మధు మైరేయము మా
మరుగు పెదలలో నిండెనులే!

వసంతుడు
ఇటు రావే

పువ్వులు
నవమల్లీ!

వసంతుడు
ఇటు రావే

పువ్వులు
శేఫాలీ!

వసంతుడు
ఇటు రావే

కవి

ఒక జాజి విరితీవ ఓవరియైనది
తూరుపుకోన పూదోట లోన;
రాగల పూర్ణిమా రజనీ ముఖాన, అ
ద్దాన శిరీషతల్పాన నొరిగి,
వేబోక యగుదాక విడియుమా యట మేన
తడియైన నునుమంచు జడియు వాన;
వలి వీవలి పిసాళి వలి నలంగి తొరంగి
వెన్నెల వెల్లిలో స్విన్నమైన

క్రొన్నన పరాగ మొక్కింత, కొంత క్రొత్త
బిండిగురివింద పూదేనె బాలచూత
రక్తపల్లవ పుటికలో రంగరించి
ఆరగించి వసంత వయస్వి వౌదు!

దరిసె ప్రత్యూష: మొంటరి వీటి వాకిళ్ళ
చిరుపదమ్ముల గురుతు లొరయ, ర మ్మొకసారి:
దరహాస పారిజాతము లల్లి, తెమ్మొక్క-
మరి భావికాల భర్మాంకుమాల కుమారి:

అలన సాగె దినమ్ము: ప్రాయమ్ము మొగసాల
నిలుచు నీ కయి తృషాకుల తరుణ హృదయమ్ము:
కలికీ వలగ్నలగ్న స్వర్ణ లావణ్య
కలశితో కల్యాణకలహంపివలె రమ్ము:

జరిగె ప్రొద్దు: సుదూర మరుగు పదముల సుంత
మరలించి, నడిపింపు విరియోవరుల దారి:
తెరువుపై చలువపందిరి నీడ లమరించి
మరి మరీ సహచరీ మజిలీల నేర్పరచి:

సందె వాలెను; ముగిసె సమరమ్ము; పెన్ ధూళి
యందు రాలెను జీవ మడరుచు దయావతీ:
తొందరగ ర మ్మక్షితుందిలము భాండమ్ము:
నందికొని, కడుగ గాయముల నెత్తురు చాళ్ళు:

తరిమి మూపినది రాతిరి; ఇంక నా తల్లి
పరిమళ స్నేహ దీప మ్మింట వెలిగింపు;
పరచి వీ యభయాంక పర్యంక, మలసమం
థరరుతిని వాత్సల్య భరగీతి వినిపింపు;

అనుకోని అతిథి

అడుగలేదు రమ్మని - ఏ యడుగు సవడి వినలేదు:
వడివడిగా సీతుకారువాకిలి గొళ్ళెము తీసి
అడుగిడినది నా విశీర్ణపర్ణశాల మోసాల
ఒక అచ్చర: ఒక్క వియచ్చర:

అడుగకుండ మంచువలన తడపిన పాదాలతో
నడిచివచ్చె లోనికి, నా క్షుద్రకుటీరాంతరమున
తడబడగా నీడలు, తన వెంట ప్రభాతము తెచ్చి
అంత అచ్చర: ఆ వియచ్చర:

బుజము పైన గదియించిన పుత్తడి గిండియ నిండి
గజిబిజిగా నుండి సగము నిజములైన స్వప్నమ్ముల
బిరబిర నా యెడిలోపల ఒరిగియొరిగి కురిపించెను:
అప్సు డచ్చర: ఆ వియచ్చర:

నమ్మలేదు తొలుత: అంత నయనమ్ముల నులిమి విచ్చి
అరసినంత నేల హిమపదాంకములే మిగిలె:
గదిలోపల పారిజాత కల్పవాసనలు రగిలె:
లేదు అచ్చర: ఏ వియచ్చర:

తిరునాళ్ళ చేమంతులు

నాకనందన హరిచందనముల కన్న
కరము ప్రియములు చేమంతివిరులు హరికి;
ఆరు కాలాలు తిర్నాళ్ళ కనుచు వేచి,
పూచి యిచ్చును కైంకర్యమునకు వాని।

సురవరానీత కల్పప్రసూనమాల
అడుగులంబడి సాగిలబడి యొదుగును;
చేరు శ్రీవత్సకౌస్తుభశ్రీనివాస
మే మెసంగు చేమంతికాదామకమ్ము

హారాలై మెడ జుట్టి, అంగదములై అంసాళి పై మెట్టి, లే
తోరాలై చెయి పట్టి యూగు, చన వెంతో గాని శ్రీజానితో
ధారాళమ్ములు; క్షీరసాగరసుతా ధమ్మిల్ల మాల్యమ్ములన్
హేరాళమ్ములు పీఠికాపురవనీ హేమంత చేమంతికల్।

మెత్తనౌ రేకులన్ పయిం బెట్టుకొనుచు
ఒత్తిలవు కూడ తిరుమేను హత్తు ననుచు
పాను పౌ తరి, ఉండియు లేని యట్లై
అప్రమత్త సేవాయత్త లైన విరులు।

చెంతన్ క్రేవల నిత్యసూరులు తపశ్శ్రీమంతులున్ వేల్పు సా
మంతుల్ నిల్వ, ప్రపన్ను లెల్లెడల తామై కొల్వ, వేంచేసి, శ్రీ
కుంతీ మాధవు డబ్ధిజారమణితో కొల్వుండు బంగారుచే
మంతుల్ తాపిన పల్లకీపయి ధనుర్మాసాన ఁరేగగా!

విగమశర్మ

ఏలాకల్లోలవతీ
వేలావనలోల పవనవీచిక, కేలన్
లాలించి లేపు, ప్రాత
ర్వేగా నిద్రాభవులను ప్రియురాలివలెన్;

చరణాయుధేశ్వరేశ్వర
చరణవ్యాకోచనీరజాతరజశ్రీ
పరిమళభర మరుదంకుర
గరుదంచల చాలనమున కన్నులు వీడున్;

మోహని ద్రాతిసాం ద్రాంధ్యముద్ర నుండి
ఎట్లు వినవైన నైతినో ఇన్ని నాళ్ళు—
ప్రత్యూషస్సుల ఆ మహాప్రభువు తానె,
కానె, తొలి కోడియై ప్రబోధమ్ము సేయ;

ఒక పాము బుస్సుమని నా
లుక నొక మెరవట్లు వరవ, లులిత లులితమై
లుక లుక లాడదె ప్రాణ
మ్మకటా! ఒక కోడి వైతివా నా తండ్రీ!

పీవిటి లోగ్రహ పావక కపీవిక క్రిక్కు లయాగ్ని కీలవై
మైన దయా గయాసుర విరాసవ తీవ్రత కోటి, కోటిరూ
పై.....

దూరము దూరమై తొలుత తోచిన గజ్జెల మ్రోత అంతలో
చేరువ చేరువై యెడద చేరును, పారును లోన నేపులై —
శ్రీ రజతాద్రిపై కొలువు చేకొనకే, దయచేసి, చంద్రకో
టీరుడు నా హృదంతర కుటీరము లోపలనే నటింపగా!

హర నట చ్చర జోపహతి చిట్లి, ఎగయుము
మిన్ను వరకు వెండి మన్ను దుమ్ము:
సారెకు చంద్ర కిశోర సుస్మేర తు
షారముల్ కడలంటి జారి పడును:
మల మెట్ల ఇరుకెలంకుల నిల్చి ప్రమథ చ
కోరము లర్రులు పార జాచి:
నా నుండి వెలువడి నేను శరన్మేఘ
తూలికవలె తేలుదును బయళ్ళ:
ఎపుడు మునిమాపు కరగెనో, ఎపుడు రజత
నగము సురిగెనో, మ్రోల కన్పడదు బైలు:
అఖిల హరిదంతరాళమ్ము నందు నిండి
వండె నా కోసమే అకాల పౌర్ణ మాసి!

మూడు భంగుల గొంతు మ్రోగించు కుక్కుటే
శ్వర దేవ దేవు డుషఃప్రవక్త:

తిరిగి త్రియామా ప్రహరి గాఢనిద్రా భ
రారుణాక్షి మొగుడ్చు భైరవుండు:
బిరబిర డుంటి కోవెలతోట పీర్వాయు
తుండాగ్రమున స్వర్ణభాండ మెత్తి:
అజిర ధ్వజాగ్రారుణాంశువుల్ గని నంది
గర్వాన పారించు గంగదోలు:

.....

ధనుర్దాసు

మోసాలన్ బధిరాంధ భిక్షువులు "రావో ప్రోవవో ఓ కృపా
ళూ సామీ"యని మోరలెత్తి పిలువన్, లోలోన ఏదో భయ
మ్మో నంకోచమొ త్రోసె వెన్క-, కపుదే మ్రొసెన్ "ఓహోహో ధను
ర్దాసూ! రాగదవయ్య! రా!" యను నుదాత్తాహ్వాన నిక్వాణముల్!

రంగేశయాన గేహ
ప్రాంగణ దేహళిని విల్చి, వదువయు నోరా
రంగా 'రంగా' యని పిలు
వంగా, వైకుంత మొరుగు వాత్సల్యమునన్!

ఒక కను గ్రీష్మ భీష్మ కుతపోగ్రత రార్యమ మండలమ్ము! కా
ర్తిక శిరాంశు బింబము గదే యొక నేత్రము; లోకలోక కా
సకుడవు నీవ, నావలచు చల్లని సామివి నీవ, అక్షియు
గ్మక మొకపారిగా విరియగా వెరగా యిక రంగనాయకా!

ఏలా దాచితి విన్ని నాళ్ళు దయలేనే లేదటయ్యా, భవ
ల్లీలాలోల విలోచనాంచల తటిల్లేఖా చలల్లాస్య మే
నాలోకించితినా, శిలా జటిమ పాయం ద్రోయనా రంగడే
వా! లావణ్య పయోవిధీ! వివశ నృత్యం బాడనా కేకినై!

నా తండ్రీ చిరదగ్ధ జాంగలము ప్రాణ మ్మిద్ది - యుష్మత్కృపా
స్వీత స్మీత కటాక్ష వీక్షణము, ప్రావృ డ్మేఘమాలా గళ
చ్ఛీత స్రోతము, ఒక్కమారయిన వర్షింపంగదే - ఆరునే
మో తృష్ణాగ్ని! రవంత చల్లబడునేమో జీవ మోయీ ప్రభూ!

కన్నులు కల్వ పూలయిన, కజ్జల రేఖ మిళింద బృందమై
న, న్నును చూపు తూపయిన, నాళము మోస మశాంతి గాక యే
మున్న దయా దయావ్యయ పయోనిధి! అంధజగత్తులోపలన్
తెన్నులు తెల్పునో? ఎదుట నిల్పునొ మిన్నులు రంగనాయకా!

కను లని నల్లకలువ లని
అనుకొనుచే కాని, శతసహ స్రార్యమదీ
ప్తిని మించి, శతసహస్ర తు
హినకర శీతలత నించునే రంగేళా!

కనగ కనగ నీది కన్నేది మిన్నేది!
అడుగులేవి, కడలి యడుగు లేవి!
ఎరుగనైన లేను; ఏమేను లేని నీ
నీ దృగాళి నెట్టు లిమిడినావు!

వెలికిన్ జూచెదనో, లో
పలికిన్ జూచెదనొ, యింక బహిరంతరముల్
వెలుగో ఆనందమొ! ఇది
జలనిధియో చదలొ తెలియజాల రమేళా!

మల్లిణి

"ఏలాగునే మల్లిణీ" — "స్వామి ఏమందు" —
"మందుంద" — "మనసంత సందియములె" —
"తుది మొదల్ తెలియ దేదో" — "వింత సందెలో
తెరగాయె" — "ఎరుకంత కరగిపోవు
వెరగాయె" — "మేనంత తెరచిన చూపాయె" —
"చూపంత విందిన రూప మాయె" —
"సీవా సీవా" — "మల్లెపూవా వెన్నెలప్రోవా
తలపైన" — "అళికాన తిలక మౌనొ,

అనల నేత్రమె యౌనా" — "ఆ యరుత పొగడ
పూలచేరొ, కాకోదరమాల సొరొ" —
"అరెరెఁ నామ్రోల సుందర తరుణ మూర్తి
సీవా మల్లిణిఁ నా తండ్రిఁ సీవా సీవాఁ"

ఓవని లజ్జ నీ పదపయోజములన్ వడిపోదుఁ ఆ వయిన్
నా వయా సుంత పంగి, కిరణా వరుణాలయ, నీవు చేతులన్
జాపెదు; అంత నా వ్రతుకు చల్లబడున్ జలు జల్లులైన సొ
రావగ వీటి సోనల, హిమాంశువు వంక తొలంకు వానలన్;

ఆవగ సోగ పాగ నెటు లౌదల జుట్టితో, ఎట్లు పెట్టితో
ఆవయి ఓరగా నవసుధాకర రేఖ తురాయిగాగ, నీ
రూపు కనుంగొనన్ మనసులో గొన తొందర లౌనుగావి నీ
దాపున నిల్చి నీ యడుగుదామర చూపులె నిల్పజాలనే?

మదనారీ మృదులాంక పాళి, కుచయుగ్మ స్ఫార శయ్యాళి, మో
హదళా ఘోర నిశాసుషుప్తి వివశంబై పోయె నా శీర్ష మో
మదనారీ! ఒకసారి నీ చరణపద్మ మ్మంటగానిమ్ము; నా
బ్రతుకుం ద్రోవల క్రొత్త ప్రొద్దు వెలుగుం బంగారముం నిండగా

విను మిదె చేతులెత్తి వినిపించెద - నే నొకతూరి తెల్విమా
లిన జిడుదన్, విమూఢుడ, మలీమస హృత్తుడ, చిన్నుడన్, కతుం
డ వగుట యంత్ర కర్మ కలనంబు ఘటింపకు; ఆజవంజవం
బను గహనంబు వింక ఆభవా చొరజాలను తండ్రి వెండియున్!

ఆగస్టు 15

కొన్ని తలపు లేవేవో
ఉన్నవి నాలోన నేడు।
స్వాతంత్ర్య వసంత వేళ
స్వాంతములో చివురించినవి।

చిరదాస్య హిమర్తు మృత్యు
శీతలత తొరంగె గాన
క్రొంజివుళ్ళ కెంజిగిలో
క్రొత్తవొ ప్రాతవొ కాపీ
కొన్ని తలపు లెగయును సన
సన్నగ నాలో।

ఉన్న తలపు లన్నీ పై
కుబికి రావు — ఏ వెరపో
నాగళమ్ములోన పొంచు
నల ని చీకటియె।
స్వాతంత్ర్య వసంత వేళ
సాక్ష్మవ నందనాన

పల్లకీ

ఒక విషాహి హూత్కారము
ఒక వృక వికట విరావము
విన్నటులై:

దుష్ట ధవళ భుజంగ దష్టమై మన జాతి
ఒకనాడు పెనుధూళి నొరగిపోయిన వేళ
మ్రోగించె మన మహాత్ముడు నిర్భయ మురళి:
మ్రోగించె మన రవీంద్రుడు తరుణ కాహళి:

శృంఖలము లవనిపై చెదరునప్పటి యులివు
శంఖములు మోరలను చాచునప్పటి మ్రోత
ఒక మహాత్ముని నోట ఒక రవీంద్రుని పాట
సాగి రాగా ఊగి తూగి విన్నాము: వివి

వారి వాక్కులు ఖడ్గ ధారగా, వియదావ
గా సుధాధారగా, పారగా పౌరలగా
"వీరు నిర్గత సకల బంధనులు, నిర్భయులు,
ముక్తు" లని నొసట కేల్మోడ్చి మ్రొక్కితి మపుడు:

ఈనాడు మన నవ స్వాతంత్ర్య వాసంత
నందనములోన స్వచ్ఛంద భారత కవిని:
నిలిచి నిర్నిద్ర గళ నిస్రుత సుధావిరళ
ఝురుల కురిపించి దెస దెసల పరవించలేను:

ఈనాడు నే నేటి నా నాడులో మకుట
ధారినట నేను స్వచ్ఛంద భారత కవిని:

ఏల రాదో వెలికి జాలుగా నా పాట —
క్రొత్త బాటల గొండ్లియాడు వెలుగులయూటఁ
ఒక మూల్గు ఒక జీర ఒక్క చీకటి చార
ఎటనుండి వచ్చి ఈ యెడద దూరెనో యోఁ
నవన వోన్మిషిత స్వతంత్ర భారత భార
తావిరత జనతా జయోత్సవమ్మున నుండిఁ

ఉన్న నంకెల, కారుకొన్న ద్వేషము, పేరు
కొన్న మోసము, క్రూర హింసారిరంస, మన
మున్న మిన్నుల నడుమ నున్నయవి నాలోన
నన్న సన్నగ నిండు కొన్న వేమోఁ కాని

న న్నావహింతురాఁ ననుగన్న తండ్రి గాం
ధీ దేవుడు రవీంద్ర గురుదేవుడును నేడు—
ఒక్క రక్కసి నేవి, ఒక విషాహిని గాని
ఉండనీ నీ పురా ణోద్వేలోవల నేనుఁ

న న్నావహింతురా ననుగన్న తండ్రి మో
హనదాసు గాంధి కవిరాజ దేవేంద్రుడును—
ఒక కడుపు పొలిమేర సెకలు రగులగ నీను—
ఒక్క కను కొలికి నొక చుక్క నిలువగ నీనుఁ

న న్నావహింతురా ననుగన్న తండ్రి శ్రీ
కర్మచంద్రులు విశ్వభారతీంద్రులు నేడు.

ఎగుడు దిగుడులు లేని సొగసైన వీడుగా
మూడు పడికోట్ల మన నాడు నిర్మింతుఁ

కవి భట్టుకా, డుల్లాకము కాడు, ప్రాణాగ్ని
యెడలిన శవముకా, డివము కాడుఁ
ఒకరిని భూషింప నొకరినేన్ ద్వేషింపఁ
డాతనిగుండె క్షీరాబ్ధియంతఁ
కవి మన స్పెగయు జంగమవిహంగము, ఉద
యారుణాంశువు లెదురైన జడియఁ
డసికొన కవిమన స్సది ఆరయును దొల్చి
యెల్లకల్లల, నెల్ల యెల్ల లొల్చిఁ
లేదు భయము, నిస్పృహ లేదు, లేదు తృప్తి,
శీతలత లేదు, జడతలే, దాత డొరసి
యెరసి తిరుగాడు ప్రతిజీవి నరసి, నివురు
కప్పని తరుణ విస్ఫులింగ మ్మతండుఁ

అన్న తలపు లేవేవో
ఉన్నవి నాలోన నేడు
స్వాతంత్ర్య వసంతవేళ
స్వాంతమున చిగిర్చిఁ కాని
ఉన్నతలపు లన్నీ పై
కురలి వచ్చునా?

ఉగాది

ప్రథమ వత్సరాది యెప్పుడో
ప్రథమ చైత్రరథముపైని
ప్రథమ వత్సరాదిని గని
వచ్చిన అతిథికి మానవు
దిచ్చే నెట్లు స్వాగతము।

మధురాళా మస్మణ కిసల
మాలిక లల్లేనా।
మహిత మనోరథ మంగళ
రంగవల్లు లుంచేనా।
దోహలమున ఊహల సుమ
తోరణములు కూర్చేనా।
ప్రథమ చైత్ర రథముపైని
ప్రథమ వత్సరాదిని గని
వచ్చిన అతిథికి మానవు
దిచ్చే నెట్లు స్వాగతము।

మత్తమరు ద్గరుద్వీధి
కొత్త ఉత్తరీయ మెగర

అరుదెంచిన తొలి హాయన
మరసి బ్రతుకు హాయి అనెనఁ
ప్రథమ వత్సరాది నాటి
నవజీవన పల్లవములొ
నవ్యవాసనాలవములొ
వేణువులూ వివిధపుష్ప
రేణువులూ తొలియామని
రాణువ గని బ్రతుకంతా
హాయె యనుకొనెనాఁ

తన గళమే కోయిలగా
తన మనసే ఊయెలగా
మనుగడ ఎర్రని చివురుల
మావి కొమ్మ అనుకొనెనాఁ
ఇఱుకొండ మనుకొనెనాఁ
ఆ యుగాదినాడె మనకి
హాయియె యనుకొనెనా. లేక
మాయయె యనుకొనెనాఁ

ఉగ్ర నిదా ఘాగ్రహము
వర్షాకరుణాశ్రుజలము
జడ హిమర్తు నైరాశ్యము
వడి వచ్చే నని తెలియక
ఏ మనుకొనెనోఁ

వత్సర వత్సర మట్లే
వచ్చినట్లై పోయెనట్లు
అశ్రువుతో హాసముతో
అమృత హాలహలములతో
అంతకంత కతిశయించి
అంసముపై వేగులతో।

కాని, యెట్టి వీరవరుడో
మానవుడు।
మానడు ఆనందోత్సవ
మీ వరుడు।
ఆశలు కళ్ళలు లేని
గుర్రా లీతనికి।
మన్ను మిన్ను కలియువరకు
తెన్ను వీనికి।

ఊరే కోర్కెలపైని స
వారి చేయుచు
లోకమెల్ల క్రమోన్మిషిత
నాకముగా మారు వరకు।
ఏ యుగాది కా యుగాది
కెప్పటి కప్పుడె యెదురై
ద్వారముకడ చిరునవ్వుల
హారతు లెత్తునో మానవుడు।

పల్లకీ

కనుక జయా స్వాగతమ్ము॥
మరిమరి స్వాగతమ్ము॥
భావియంత బంగారపు
పంట యగును గాక॥
రాగల కాలము కాంతికి
తావల మగుగాక॥
గుండెలెల్ల కలిపి ఒక్క-
దండగాగ కూరిచికొని.
ముందు ముందు ఈ మానవు
లందరు ఉందురు గాక॥

కడచన్న యేడు రాగల యే దొకేరూపు
జీవితమధు వింకిపోవు వాని-
కీ యేడు వెనుకటి యేడుకన్నను పాడు
వయ స స్తగిరివైపు వాలువాని-
కేయేటి కాయేడె యేడుపే తొలిప్రొద్దు
శోభ చూడని గూబచూపు వాని-
కీ యేడొ ఏ యేడొ ఎవరి కేమో తామ
రాకున పీటి బొట్టయిన వాని-
కసలు రానున్న దెప్పటి కపుడు మంచి
పిసలు కా వేపు చెడి ముదిసినవె పోవు-
ఈ నిజము నెంచి నిలబడుం డిచట, ఈ జ
యాంగణాన అనుంగు తెనుంగులార॥

యువగీతం

మంది కృత మహాయుగం।
ముందున్నది ముందున్నది
ముందున్నది మందే, మరి
మందే యువ మహాయుగం।
కలికాలం, మసలి మసలి
చలికాలం మసలి మసలి
కొండ చిలువలాగ, పెద్ద
బండలాగ దొర్లిపోయె।

బరువుల్లో దొరువుల్లో
ఇరుకు ఇరుకు బిలముల్లో-
కునుకు జరభ కలికాలం-
వెనుక నడకల కుటీరం।

పీకలాంటి భూతం మన
తాతల్ది తండ్రుల్ది।
రోత రోత రోత - మంది
ప్రాత ర్వియదావాసం।

ప్రాత రుజ్వ్ లాకాశం।
భావి మంది రావాసం।
స్ఫీత జీవ ధౌత నాక
నేతలం విధాతలం।
స్ఫీత చలత్ ధౌత లసత్
చేతనులం నూతనులం।

మన కే మిక। మన కే మిక।
మంది కృత మహాయుగం।

రేడియో

బ్రోకా మాటకు రెక్క లున్న వట: నే డా మాట ఇప్పాది ఎ

ట్లారోహించి మహావిహాయసము, నె ట్లందున్ - ఒకేసారి కా

వేరీ దేవ గృహాంగణ ధ్వజ శిరోవీథీ మరుద్వీచి, కా

శ్మీ రారామ మనోజ్ఞ కుంకుమరజ స్సి గ్ధావి లోర్మిచ్ఛటన్:

జీవన శంఖం

అలసిపోతుంది గాలి ఒక్కొక్కప్పుడు
వెలుగు చచ్చిపోతుంది ఒక్కొక్కప్పుడు
స్వాధీనం తప్పిపోయి
ప్రాణశంఖాన్ని పాపం -
దూరిలో జారవిడుస్తుంది
దుర్బల హస్తం - అప్పుడు

నిదురించే నిశీథి నపుడు విస్ఫురంగా
తట్టి లేపుతుంది తటిత్కళాఘాతం
పీరసవడిన హృదయాన్ని ఊపి ఊపి
పిలబెడుతుంది నవతారుణ్యమంత్రం
ఒక్కసారి ఏయదృశ్యశక్తి
ఊపిరి ఒత్తిడికో
గొంతు సవరిస్తుంది మేలి
కొంటున్న జీవనశంఖం

దూరగగన ఫాలాన శుక్రతార పొడుస్తుంది
చేరి ప్రభాత పదధ్వని చెవిలో పడుతుంది

పేరు పేరునా ఒక్కొక్కరినే
మారు పలికే దాకా
ఊరుకోక పిలుస్తుంది
ఉదయారుణ శంఖం!
ఉండి ఉండి ఉద్రిక్తమై
వీరోజ్జ్వల శంఖం!

"మన కింక నిద్రలేదు - వీల్లేదు!
మన కింక ఇల్లు లేదు - అక్కర్లేదు!
అనుకున్న కడపల అందుకునే దాకా
అనల వర్షం కింద మనం నడవాలి!
తప్పదు!"
ఒక్క పెట్టున మృత్యువుకన్నా
ఉగ్రంగా - చనవుగా -
ఉరుముతుంది రుద్రశంఖం!
ఉన్మత్త విలయ శంఖం!
ఒళ్ళు విరిచి లేస్తుంది గాలి!
కళ్ళు తెరిచి చూస్తుంది వెలుగు!
వల్లమాలిన ఆవేశంతో
అందుకొంటాడు మానవుడు
మట్టిలో మరిచిపోయిన
మహావీర శంఖం!

పల్లకీ

ఉల్లాసంగా ఒత్తుతాడు

విజయోత్సవ శంఖం

చల్లగా పూరిస్తాడు

కాంతమంగళ శంఖం

చరణసన్నిధిని

ఒకప్రాయమందు పీటికి తల్పా లుండవు;
తెరచియుండును నవాతిథి యేరి కోసమో!
ఆనాడు ఒక సురభిళావిలము వచ్చి, నా
లోన నింపినది నవరసధాని నీ వాణి!

అపుడు నా గొంతు రవ్వంత కోయిల గాన-
అపుడు నా మనసు ఆవంత ఊయెల గాన-
అపుడు నా మనికి తరుణారుణాళిక గాన-
ఆలపించితిని అల్పాల్పగీతులు కొన్ని!

అప్పుడే ఒక మంగళావిలము కొనితెచ్చి
అందిచ్చిపోయె అజరామరము నీ వాణి!
నా గీతి అప్పుడే నగలన్ని విడనాడి
శిరసు వంచెను భూవరకు నీ పద మూని!

వందన మయ్యా అభినవసుందర
కవితారాజ్య ధురంధరా!
రసిక మనోమందిర! కవి పురందర

నవ్యశక్తి

స్వార్థమ్ము కల్పాంతసమయాంధ్యమైన,
దారుణ రుషోద్గరణ మారణమ్మైన,
ఏ యుద గ్రాగ్రహ
మ్మే యుదా త్తావేశ
మావహించిన షరుగు నరుడై -
ఆవరించిన నరు దమరుడై

జగత జగతి భువన నరక భవనమున నవ
మంగళయుగ స్వర్ణమండల శ్రీరుచుల్
వింధించు
నమసౌఖ్యము నమృద్ధి
వందించు,

ఆ శక్తి
ఆ నేత్రి
ఆ నిత్య శుభదాత్రి
శాసించు మమ్ము - ఆశాసించు నహనహమ్ము!

తుషారాద్రినిద్ర

తానుకల్పమ్మ్మలను లేవనైన లేవ,
దొక యుదయమైన నాడు మేలుకొని నాడు:
అది మహానిద్రయో - తుషారాద్రి చూడ
చిత్తగింపక కనులు మూసికొని నాడు।

సడలి సడలని వలిరెప్ప సందులంట
నెల్లో కనినాడు, కనుబొమ లెత్తినాడు:
నాటి మానవులను పేద కీటకమ్ము
లూరకే పెన్గులాడుచున్నారు క్రిందఁ।

అంత తన గుండె యెగయ దిగంత మంట
ఉస్సురని యొక్కసారి నిట్టూర్చినాడు:
కులకులని రెండు కన్నుల నొలుకు నశ్రు
ధుమల చెక్కిళ్ళ చారలు చార లయ్యెఁ।

అంతలో మున్గిపోయినా డపుడె మరల
అద్రిరాజు హేమంతయుగాంత నిద్రఁ।

హోరుమని ఆర్చినవి సప్తమారుతములు:
హోరుమని లేచినవి సప్త వారివిధులు:
ప్రళయ మిది ప్రళయ మ్మని వడకి యొదిగి
కను మొగిడ్చి రీరేడులోకాలవారు:

ఆప్పుడుగాని అరుణోదయం కాదు

నన పెడుతుంది ఈ రాత్రి
వలపుతుంది కురుపులాగ

ఒక్కొక్కచె ఒక్కొక్కచె
చుక్కచుక్క చినుకు పడి,
కుళ్ళి కుళ్ళి పిసినారి లాగ.
కుమిలి కుమిలి పిరికిపందలాగ.
గొంతు పిసుకుకొని
గొప్ప యింటి విధవలాగ-
ఏడుస్తుంది ఈ రాత్రి

చూడలేక మొగం తిప్పేసుకుంటున్నాయి
చుక్కలు
చప్పున తప్పుకుంటున్నాయి
గాలులు
వెక్కి వెక్కి యేడవలేదు
దిక్కుమాలిన రాత్రి
పిసినారి రాత్రి-పిరికిపంద రాత్రి

గొల్ల గొల్లుమని జల్లుజల్లులుగా
వెళ్ళబోసుకోవాలి శ్రావణ మేఘంలాగు
బారుబారుమని పారజాచుకొని చేతులు
హోరు హోరు మనాలి పడమటి గాలిలాగు

బాగా ఏడు రాత్రీ!
భయంలేదు-బిగ్గరగా ఏడు రాత్రీ!
గోలపెట్టు రాత్రీ! గుండె బాదుకో రాత్రీ!
వెళ్ళిపోయేలోగా వెక్కి- వెక్కి యేడు!
అవ్వుడుగాని అరుణోదయం కాదు!

మబ్బామలా

గిరిపయి వాలిన మేఘం
జరిగిందా-జరిగిందా।
జరగలేక బరువుకి అపె
ఒరిగిందా-ఒరిగిందా।

కురిసి కురిసి వానజల్లి
తరిగిందా-తరిగిందా।
కరగని శిల జూచి మనసు
విరిగిందా-విరిగిందా।

వెలవెలనై మబ్బు దవుల
కరిగిందా-అరిగిందా।
మల చెక్కిట పీటిచార
చెరిగిందా-మిగిలిందా।

హాలికుడు

వేల శతాబ్దుల వ్రేగులవల్ల
వంగిపోయి,
విశేష భూమీ భారం క్రింద
క్రుంగిపోయి,
అణగిపోయి,
అణగిపోయి,
అహరహమూ నేలవై పే
ఆదే పనిగా చూస్తూంటాడు:

నాగలిపైన బరువుగా ఒరిగో,
గొడ్డలి బుజాన వేసుకునో
నిలబడతాడు:

యుగయుగాల శూన్య మేదో, వాని
మొగంలో స్ఫురిస్తుంది:
ఆనందమూ నిస్పృహా అన్నవి
అన లేమీ యెరగని జడుడు:
ఏడవ లేడు; కన్నీ రోడవ లేడు.
ఆశపడ లేడు; ఆహ్లాదపడ లేడు.
కొయ్య, రాయి, ఎద్దు -
పీటికి తోబుట్టువు వాడు.

వాని ఫాలం అంత అర్ధరహితమయ్యేటట్టు
వేని చేయి తుడిచివేసిందిా
వాని మనస్సులో వెలుగు
వేవి యూర్పు ఆర్పిందిా

వానికి చేతకాదు చుక్కలవైపు
చూపుల్ని పరపించడంా
అమృతగానంలో ఆరోహణావరోహణాలు
వానికి అపరిచితాలుా
ఉషఃకాంతిరేఖ, సంధ్యాసమయారుణిమ,
ఏమీ పట్టించుకోడు వాడు.

బాధామయశతాబ్దులు వాని
భయదమూర్తిలో తొంగి చూస్తాయి.
వంగిన వాని బుజంలో
కాలపురుషుడు రచించిన దుఃఖాంతనాటకం
కనబడుతుంది.

వానిని మనం దగా చేపినట్లు, దోచుకున్నట్లు,
మలినపరిచినట్లు,
వాని వారసత్వం పోగొట్టినట్లు
అనిపిస్తుంది నాకుా

వల్లకీ

అయ్యాఁ అధికారులూ ప్రభువులూ
సామంతులూ శ్రీమంతులూ
ఆ భగవంతుని కిదా మన మర్పించుకునే ఉపదఁ
ఆ వంగిన నడుమును ఎలాగున సరిజేస్తారు మీరుఁ
ఆ క్రుంగిన బుజం ఎలాగున నిలబెడతారు మీరుఁ
వేరు వేర్పుకారు వానికి వెలుగుకోసం పైకి చూడడం

(ఇది ఒక ఆంగ్ల పద్యం - "The Man with the Hoe" by Edwin Markham -సారాంశం)

భావకవి

ఆసలు శ్రావణమాస మధ్యమ్మునందు
కురిసి తీరాలి వర్షాలు; కొంచె కొంచె
మేని రాలాలి తుంపర లేని; కాని
ఉక్కుమాత్ర మేమాత్రమూ ఉండరాదు!

ఇపుడు నా వొళ్ళు కొంత లావెక్కి, సుంత
కదిలితే చెమట జడులు క్రక్కుతుంది;
నేనె వర్షపు మేఘమైతేను పైన
ఒట్టిపోయింది కొండపై ఉత్తమబ్బు!

ఓసి నీ యిల్లు బంగారమో మరేమొ
కనబడ వదేమి పడమటి గాలి! మాకు
అవసరములేని చలిషేశలందె యెగసి
యెగసి పడతావు మామీద ఏడిపించి!

ఆంధ్రసాహిత్యపరిష దధ్యక్షు నడుగు
తేను నీ మాట, వెంటనే యిట్లు చెప్పె-
"అలసి సొలసి వాలెను వరుణావరోధ
శ్యామినీ గండ కర్పూర పాళులందు!"

నాకు మాత్ర మా భావము నచ్చలేదు.
భావకవిని కాబట్టి, "ప్రియావియోగ
నిబిడ నిశ్వాసములు రేగి నేడు మునర,
వందరూ గుండెలేని వా రగుటచేత;"

వారికీ మాకు ఉన్న దావంత తేడ;
లేని మేనకతో వారు ప్రేమలేని
ఉవరతుల మున్గిపోతారు; ఉన్న చెలియ
సోయగము మాకు ఊర్వశీ తీయదనము;"

అపుడు మబ్బుంచె చాలు, అనాత్తవంపు
నర్తనము చేసె పురివిచ్చి నాయెడంద;
ఇంక శ్రావణ మేఘ మంచేన, గుండె
వీలగగనమ్ము, గాలియయ్యాల రెక్క;

నేను కళ్లెత్తి కాన్త చూశానో, అపుడు
నాకు కనబడుతుండేవి ఆకసమున
ప్రేయసీమేఘమేఖలయో, ఎదురుగ
ఊర్వశీకైశికీచ్ఛాయయో కదలుచు;

అప్పుడప్పుడు ఆరోజులందె కొన్ని
కొన్ని రాత్రుళ్ళు, పాకుతూ, కుములుతూ, వ
గర్చుతూ, మూల్గుతూ మింట కనబడేవి
చెలియనిట్టూర్పు నల్లపొగల గుబుర్లు;

ఎప్పుడో ఎప్పుడో పైకి ఎగిరి ఎగిరి.
నేను ఋషినై, పొడుపుకొండ పాను వెక్కి.
తూర్పు వాకిటి కేపి చూస్తూంటె కాస్త
తేలుతూండేవి పీతాంబరాల కొసలు।

ఇషడు మారింది బ్రతుకు; మునుపటి గొప్ప
రోజు లన్నీ గతించాయి; బూజుపట్టి
బూజుపట్టి రాయై చచ్చిపోయినాను-
వన్ను *చెరసాలలో పెట్టినారు లెండి।

ఇంత పెద్ద ఖైదుకు గూడ ఇంత గుడ్డి
కన్నులాంటిది కిటికి; రెక్కలను ముడిచి
కూడ చొరలేదు చిరుగాలి; మోడు నార
సాలలో గిలగిలలాడి సాగు వెలుగు।

ఒక మొయిలు మేకపిల్ల। వే రొకటి ముసలి.
మరి యొకటి ముసుగిడ్డ బ్రాహ్మణ వితంతు.
వొకటి తెరచాప గుండె విప్పుకొను పడవ.
ఒకటి వెన్న. యొకటి దూది. యొకటి నురుగు।

కారుమబ్బులదారు సవారి చేయు
సాదులో. సామజసమాజమో. దిగంత
ములకు విడబారి సాంబ్రాణి పొగల పాయ
పాయ సందుల నుమియు వప్పరల కురులో।

---

* ఉద్యోగం చేసిన కాలేజీ

ప్రతిపదార్థమ్ములోని రూపమ్ము వరకు
అసలు తత్వమ్ము కొరకు ప్రయాణమౌ మ
నస్సునకు అడ్డుకంచె లన్నవియె లేవు;
ఇపుడు మేఘము మేఘమే; అపుడు కాదు;

రాజా రామమోహనరాయ్

తారాధ్వమ్ముల దాటి స్వర్గపదముల్ తాకంగ శీఘ్రమ్ము. నీ
హారాహార్యము వోలె తోచెదు. మహాత్మా. దూరదూరాల. మా
కై రాగామృత వాహినుల్ పొరలిరాగా. తావకోదారవి
స్ఫారస్వాంతము నిండి పూర్ణయమునా భాగీరథీ సింధువుల్;

సుప్రియ : బుద్ధభగవానుడు

శ్రావణములు మూడు చనెగాని చినుకేవి
లేక, నేల గుండెదాక ప్రీలెఁ
కరవు వచ్చి ఊరుదరి మావితోపులో
ఆకులట్లు ప్రాణు లట్టె రాలె.

కలవారు కాస్త విలిచిరి,
అలము నిరుల గ్రుడ్డిదివ్వె లట్లు; ముసుగులో
పల పిల్లు రోగి మూల్గుల
వలె, వడకుచు, మిత్తినోటి వాకిటి మొగలో.

వార్త విన్న దయావార్థి వచ్చి విడిపె
తపసి ఆ తోటలో మృద్వితర్దికపయి:
వానిరాక నెరిగి ఊరివారు, వచ్చి
మూగి రచ్చోట మ్రోడుల మ్రోడులట్లు.

చిరునవు మీగడల్ మిసిమిజిడ్డుల నొడ్డుల చిందగా, కర
త్పరసులు సంయమి ప్రభువు చల్లని కన్నులు మున్ను: క్రేవలన్
దొరసిన తావులన్ తడుప నోపున: విప్పు డదేలొకో క్షమం
దొరగును, పిల్చు నెవ్వనినొ తొందర తొందరగా చలించుమన్:

స్వామిని చూడలేక తలవాల్చిరి పౌరులు; వారి నారయం
డా మునిఁ; జెంత శిష్యపయి నల్లన చూపిడె; ఆత డా దయా
ధాముని చిత్తముం దెలిసి, తత్ప్రభ గన్గొని, "ఈ జనమ్ములో
క్షమము నెవ్వరేన్ తరుమ జాలుదురా" యని హెచ్చరించినన్;

"ఇన్ని నాళ్ళనుండి ఎగబెట్టినది వాన;
ఎన్ని యేళ్ళ కరవొ యెవ డెరుంగు?"
అని తలంచికొనుచు ఆట నొక్కడేని వా
కదపబోడు; చూపు మెదపబోడు.

"ఉన్న మేటి కొటారు లూడిచి యిచ్చినన్
తిందురో రత్న మాణిక్యములను"
"విధుర కేదారంపు బీడులబడి యిచ్చ
వచ్చినంత మెసవవచ్చు మన్ను"
"కరగింపనౌ మేనికండలు, ఏలాగు
పిలిచి పిండుదు లేనిజలదములను"
"ఆనదు విశ్వరహస్యమ్ము దాక చూ
పెందవానలరాక లెరిగి చెప్ప"

ఆని గొణిగికొంచు లోన మాటాడరైరి
ధనపతి ధరాధిపతి బాహుదర్పశాలి
విపుల విద్యాధరుడు స్వార్థవికలుడాను కృ
పాదరిద్రులు నగుచు నిర్భాగ్యు లెవరుఁ

అంతలోన ఎవరో సభయంచుల నిలిచినయట్టి
పిలుపేదో నిశ్శబ్దపు జలనిధి కలచినయట్టి
అందరు నటు గనిరి: శైశిరాభ్రశాఖపైని తొలి వ
నప్రియారవ మ్మనుకొని, "సుప్రియ! సుప్రియ!" యనిరి.

ఎండురెమ్మ మేను: రెండుమూ డాకులు
పీలికలాను; చిన్ని కేల జోలె;
బాల తోచె జీర్ణపర్ణకుటీరాన
దీపశిఖవిధాన దీనయయ్యె

"దేవర కటాక్ష మున్న ఈ దీనబాల
కరవు పోద్రోలు: అందర కలిమి నాది;
ఎవరికల్మి వారిదె యన్న అవధి కలదు;
కరుణ కావలి ఈవలి గట్టు లేదు.

"ఎన్నడో త్వత్కృపారసస్వీన్న నేత్ర
విగళి తాశ్రుల నిందు నింపితిని రెండు;
భాగ్య మీ జోలె; అక్షయభాండ మిదియె
స్వామి యడుగులకడ" నంచు పలికె నామె.

వాన కురిసి దొల, వారికణాల హ్య
దంతరాల దాచి, అల్ల వీచి,
మేను పిమురు శుభసమీరణాంగుళివోలె
చిన్ని యెఱగు తపసి చెవుల సోకె.

మరల కరగె మౌని కనులు కరుణాకాసారముల-
తెరలి ఉరికె రెండశ్రులు మృదుకపోల తీరముల:
ఒక్క మెరుము ఒక్క ఉరుము చిక్కని దొక మేఘమాల
దిక్కుదిక్కులంట జడులు తెరలు తెరలు వాన గురిపె:

ప్రభువు మనసు కరగి, ప్రభువుకన్నులు స్వీన్న
మైన వేళ మనకు వానకారు:
స్వార్థ ప్తమైన జాంగలమున అవ్వె
గంగ యమున కలిసి కదలి పారు.

మాట - మౌనము

మౌనము (స్త్రీ): విదుర నేను సీత నేను
నిశ్శబ్దము నేను।
జపము నేను తపము నేను
జలనిధి లోతును నేను।

పెదవి విడవి ఆవేశపు సీలిమను
కదలవి గిరికందరముల ఏకాంతమును।
రేలు ముసురుకొను వేళ
గాలులు దాగిన వేళ
తరుశాఖలలో వసింతు।
తరులక్రింద విశ్రమింతు।

అడుగు సడుల ఆలకించు బాటను నేను
పులుగు నుడుల దాచుకొన్న గూటిని నేను।

మాట (పురుషుడు): నీవు రాత్రివి మౌనధాత్రివి
ఒక్కపరి నా ప్రాణదాత్రివి।
నీవు రాత్రివి మౌనధాత్రివి
ఒక్కపరి నా హృదయనేత్రివి।

నీ యెడద పాల్కడలి మరిగి
మరిగి తెరలు నిరుగును నేను;
నీ కటకకింకిణుల తొరగి - నేను గలగలను
నీ చెరగు అంచులను విరిగి - నేను మిలమిలను;

నీహమా గర్భమ్మునుండి - నేను కృషినై
నీ నిశాంతాంగణమునుండి - నే వగటినై
నీ కెలన నుందు - నీవు నను విందు
ఓ సనాతన! నిత్యనూతన!

తామసి మౌనమ్మైన - తారక మాట!
తీవియ మౌనమ్మైన - పూవే మాట!
పొలతుక మౌనమ్మైన - పురుషుడు మాట!
ఓరిమి మౌనమ్మైన - కూరిమి మాట!

బ్రహ్మర్షిమాట

శ్రీమదోంకారనాద హృత్పీఠనుండి
అవిరతానంద జీవితోత్సవము దీని
నా మహానందనాథుడే అలరజేసె
ననుచు నమృతాలయాట బ్రహ్మర్షిమాట.

బ్రతుకు, చావు, కూడిక, యెడబాటు, మిన్ను,
మన్ను, ముస్సి రతని ఆట; మలయు సృష్టి
దాననే, దాననే సృష్టి స్థైర్య మూను
ననుచు రతనాల పేట బ్రహ్మర్షిమాట.

అతని ఆనందహాస లేఖాంకురములు
ననలు సొనలును, ప్రతిరణన్మంజుకుంజ
మతని ఆనందగాన రసార్ద్ర పుంజ
మనుచు క్రొందేనెతేట బ్రహ్మర్షిమాట.

పగలు రేయి ఆమనియు వేసగియు సీతు
కారు శిశమ్ము నెడురయి దూరగమయి
తిరిగి తిరిగి విధవిధాల తరలి వచ్చు
నతని ఆనంద మనుచు బ్రహ్మర్షిమాట.

ఎల్లి విచ్చేయుటకె మెలమెల్ల జాగు
నతని ఆనందమగు దినాంతారుణాభ;
అతని పునరాగతానందగతుల తెల్పు
ప్రత్యుషోభ యనుచు బ్రహ్మర్షిమాట.

ఒక్క కనురెప్పసాటేని ఊరకొనక,
ఒక్క నలుసంతయును పునరుక్తికనక,
అంతకంతకు వృద్ధియౌ, నంతకంత
కందమౌ, సృష్టియంచు బ్రహ్మర్షిమాట.

ఆ మహానంద కాంతిగర్భాంతరాళ
మందు సముదయ మందచు నవతరించు
నవనవమయూఖరేఖ మానవుఁడటంచు
నలరు తేనియతేట బ్రహ్మర్షిమాట.

మానవుడు రక్త మజ్జాస్థిమాంస రచిత
విగ్రహామె కాదు; భావించి వివిధగతుల
అనుభవించి, నిశ్చయించి, ఆచరించు
యంత్రమేకా దటంచు బ్రహ్మర్షిమాట.

ఆది నొక్క చిన్మూర్తిగా నవతరించి
అల నలన సత్యరూపత నతిశయించి
పూర్ణ వైభవమూర్తి సంపూర్తినందు
నతఁడు మానవుడనుచు బ్రహ్మర్షిమాట.

పల్లకీ

సాగిపోయిన వేలకల్పాల కర్మ
ఫల మహాభాగ్యరాశికి వారసుండు
రాగల యుగాల శిల్ప నిర్మాతయైన
యతడు మానవుడనుచు బ్రహ్మర్షిమాట.

కారు చీకటిలో బైలుదేరి, అమృత
కాంతి కోరి, సతమ్ము లోకమ్ములో ప్ర
యాణమగు బాటసారి యీ మానవాత్మ
అనుచు నమృతాలతేట బ్రహ్మర్షిమాట.

ఎన్ని సుఖదుఃఖగాథలో హృదయఫలక
మందు చిత్రించుకొన్నాడు మానవుండు
అన్నిటికి పైని "అతడు నా యనుగు తండ్రి"
అనుటయే మత మంచు బ్రహ్మర్షిమాట.

వాది పోవక యెప్పుడు వలచు తావి
వెగటు కాబోక యెప్పుడు రగులు తీపి
మూగ వోవక యెప్పుడు మ్రోగు పాట
మతమె యని తేనెతేట బ్రహ్మర్షిమాట.

తుది మొదలు సర్వ మతని కన్నెదుట నిలచు:
అతని యేర్పాటులో నెన్నడైన నేటనో
మంచిగా చెడ్డ, మధువుగా మంచుకారు
మారితీరు నటంచు బ్రహర్షిమాట.

పత్యరతి, ధర్మగతి, గృహస్థనిధి, అతిథి
అర్చన, స్వదేశసేవన, మఖిలమాన
వానురక్తి, యీశ్వరభక్తి యని వధూవ
రార్హ సప్తపది యనుచు బ్రహ్మర్షిమాట.

ఒక్క చిరుగీతి విరిసిన, నొక్కయాస
జోతి మెరపిన, నొకమంచి చేత కొక్క
పూతసంకల్ప మొలసిన, మ్రోల నిలుచు
ననుగు చెలి వీవె యనుచు బ్రహర్షిమాట.

ప్రార్థనము లౌకికారణ్య పదములందు
పథములం దీర్చు దీపము; బ్రతుకులోని
విడని వ్యూహమ్ము విప్పి తప్పించు మంత్ర
మనుచు రతనాలపేట బ్రహ్మర్షిమాట.

రాజ పథము స్వర్గమునకు, రాజరాజు
నగరు మొగసాల తాళమ్ము, పగలు రేయి
పరమధామమ్ము చొరగ నుత్తరువు మనకు
ప్రార్థనమ్మె యటంచు బ్రహ్మర్షిమాట.

బాల్యమున దాది, పరువాన ప్రాణసఖుడు,
కష్టమున తోడునీడ, రోగమున మందు,
ప్రార్థన మ్మార్తి యందు నూరట యటంచు
నమరపదవికి బాట బ్రహ్మర్షిమాట.

కాంతి సుమముల నాశాలతాంతములను
అందికొని వచ్చి మరణశయ్యాతలమున
పరచు ప్రియదివ్యతమదూత ప్రార్థనమ్మె
అనుచు నమ్యతాలయూట బ్రహ్మర్షిమాట.

సడలు మేఘికి వీవలి, బడలు నెదకు
తీయనగు నుది, వడులు పూదీవ కమ్మ్రత
జీవ మిడు వానజడి, దీనపావను దత
దమరు నను నాస యనుచు బ్రహ్మర్షిమాట.

తమ కలిమినుండి యాత్తు రందరు నతండు
తన్ను దానే యొసంగు: నందర దొరంగు
మందరుము విన్ను పాయుదు, రతని వీడు
మతడు వెన్నాడు నమచు బ్రహ్మర్షిమాట.

ఏ మహాసాహసి దరిద్రు డీత డనుచు
నను పిలుచు: ప్రేమ వేత్రము నాది; నాకు
పదపదమ్మున పువుపువు ప్రణయలేఖ
అనుచు ఆమనితోట బ్రహ్మర్షిమాట.

నేను తట్టగ తెరచుము తాను, రోయ
నేను తా తోచు, నే కోర తా నొసంగు
వతని యేర్పాటు నాయభిమతము నొకటె
అనుచు క్రొందేనె తేట బ్రహ్మర్షిమాట.

ఎల్ల తెరలు తొలంగగా, ఎల్లముడులు
నడలగా, ఎల్లయెల్లలు చదునుగాగ
నీ మహానందవనములో 'నీవు నేనె'
యను నతడు ముక్తుడనుచు బ్రహ్మర్షిమాట.

నీతి పద్ధతి గరువాన నిట్టనిలుచు
తావులం దెల్ల ప్రేమ మస్తకము వంచి
ఓర్చి గెలుపొంది పైకొన నేర్చుననుచు
అలరు తేనియ మూట బ్రహ్మర్షి మాట,

తల తరలికాంతి, నిరులచాయల పదమ్ము-
గోపురమునకు మన బ్రతుకునకు కూడ;
కావుననె మన్ను మిన్నుల కలయిక యగు
మానవుని మన్కి యనుచు బ్రహర్షిమాట.

అందవోయి నాకు

నిఖిల రాజేంద్ర మకుట మాణిక్య ఘృణుల
పరమయోగీంద్ర వీక్షణోజ్జ్వలన మణుల
నీ పదము రంజిత మ్మేమొ! నీ గళమ్ము
దీనతృణ పుష్పమాలి కాధీన మోయా!

విగతభూషుడవో! దీనవేషివో! అ
నంత తారా సుధాంశు మా రాండ కిరణ
కటక చరణుడవో! నన్ను గన్న తండ్రి
వో! ఇకెవ్వరవో! అందవోయి నాకు!

ఈ యహంకార మెంతటి దోయి, దేవ!
నీ చరణ ధూళులకు దిగనేర నేను;
ఈయశక్తి నా దెంతటిదోయి, దేవ!
నీ దయాంకమ్మునకు లేవనేర నేను

దూరదూరాల ప్రాంగణ తోరణాల
గాఢ లజ్జా భరాలసక్రాంతి వచ్చి
నిలిచియున్నాను, నా నీడ నేనె యొదిగి
ప్రాణనాయకు మంగళాహ్వా యనకు!

కడుగవా దేవ! అక్షయ కరుణధార
ఖిన్నజీవమ్ము, కర్దమాంకితము దీని:
ప్రత్యూషస్స్నుషమా హిమప్లావితమ్ము
పారిజాతమ్ము నౌదు నీ పాదపీఠి.

ఆరని గాంగజీవరుధురు లై త్వదుదార దయాపయస్వినుల్
పారు నెడారి జీవితములన్ ఫలియించును దేవ! స్వర్ణకే
దార సజీవభాగ్యము! నితాంతనిశీథమునన్ చలించు వా
రారయనేర రోరిచి సమగ్రము యుష్మదనుగ్రహప్రభన్

జరలేని దా యౌవనమ్ము నిమ్ము

దరీరదూరాల నీహారతుంగశ్యంగ
మకుట మాణిక్యమో! ప్రభామండలమ్మో!
పిలుచు నన్ను పదే పదే: నిలువలేను:
నాకు జరలేని దా యౌవనమ్ము నిమ్ము!

గండు శిల లివి చరణాలు, కనులు చీకు
చీకు చీకటిరేలు, ఏకాకిదారి
అంధ వైతరణీ ధార: ఆగలేను:
నాకు జరలేని దా యౌవనమ్ము నిమ్ము!

నా పదమ్ములు రెక్కలు, నయనయుగళి
ఆరిపోవని తారలు, యాత్ర శిర
మధుర మధుజీవవాహిని: మసలలేను:
నాకు జరలేని దా యౌవనమ్ము నిమ్ము!

వెలుగుతో, ఇరులతో, మధుపీచితోడ,
మరుగు విషకీల తోడ, సుమధుర మధుర
మైన బ్రతుకిది కల్పమ్ములేని వలయు:
నాకు జరలేని దా యౌవనమ్ము నిమ్ము!

108
PAKG 20 A 117



పవభర వ

ళాఖ

పద్యాలు

సమర్పణ

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	PAKU&SOA1117
పుస్తకం పేరు	యల్లకి
తారీఖు	05-04-23
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	121
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	5, 101, 100
లేని పేజీలు	NO
తయారు చేసినది	Chinnaiah Amrutha Hema
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	
పరిస్థితి	